
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
శుక్రవారం 29 నవంబరు 2024



రేపే పించన్ల పంపిణీ

జిల్లాలో 2,28,362 మందికి రూ.96.26 కోట్లు

భీమవరం టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి):వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు ప్రభుత్వం అందించే ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌ను ఈ నెల ఒకరోజు ముందే లబ్ధిదారులకు అందించనున్నారు. ప్రతీ నెల 1న పెన్షన్‌లను పంపిణీ చేసే విధానం అమలులో ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త సంప్రదాయాన్ని తీసుకువచ్చింది. 1న ప్రభుత్వ సెలవు వచ్చినా, ఆదివారం వచ్చినా పెన్షన్‌దారులు ఇబ్బంది పడకుండా ముందురోజే పంపిణీ చేసే కొత్త వరవడిని తీసుకువచ్చింది. అలాగే ఒక రోజు పెన్షన్ పంపిణీ చేసే విధానం అమలు రెండోసారి. ఇప్పటికే మండలాల వారీగా ఎంత మందికి పెన్షన్లు అందించాలి ? ఎంత సొమ్ము విడుదల చేసింది ? అనే వివరాలను అందించారు. శుక్రవారం బ్యాంకుల నుంచి సొమ్ములను విత్‌డ్రా చేసుకుని శనివారం ఉదయం ఆరు నుంచే పెన్షన్ అందించేలా చర్యలు తీసుకోనున్నారు. జిల్లాలో డిసెంబరుకు సంబంధించి రెండు లక్షల 28 వేల 362 మందికి రూ.96.26 కోట్లు విడుదల చేశారు.

గతంలో ఒక నెల పెన్షన్ తీసుకోకపోతే తర్వాత నెలల్లో పించన్లు ఇచ్చేవారు కాదు. దీంతో లబ్ధిదారులు పించన్‌ను కోల్పోయే పరిస్థితి వచ్చేది. దీనిని సరిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం మూడు నెలలకు ఒకసారి పెన్షన్ తీసుకునేలా ఉత్తర్వులు జారీ చేసి నవంబరు నుంచి అమలు చేసింది. దీంతో పెన్షన్‌దారులు ఒక నెల తీసుకోకపోయినా ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఇతర ప్రాంతాల్లో ఉండే వారికి ఈ విధానం ఎంతో ఉపయోగకరంగా మారింది.

నియోజకవర్గం	లబ్ధిదారులు	నిధులు
ఆచంట	29,249	12.29 కోట్లు
భీమవరం	30,973	13.12 కోట్లు
నరసాపురం	27,325	11.43 కోట్లు
పాలకొల్లు	29,398	12.35 కోట్లు
తాడేపల్లిగూడెం	31,396	13.39 కోట్లు
తణుకు	36,057	15.28 కోట్లు
ఉండి	35,293	14.68 కోట్లు
ఉంగుటూరు	8,671	3.72 కోట్లు
మొత్తం	2,28,362	96.72 కోట్లు

బడి భోజనానికి మరింత బలం



ఏలూరు అర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి):మధ్యాహ్న భోజన పథకంలో ఒక్కో విద్యార్థికి ఆహార పదార్థాల ఖర్చును పెంచనున్నారు. వంట ఖర్చులను పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోగా, రాష్ట్ర ప్రభుత్వం భాగస్వామ్యం అందించనుంది. మధ్యాహ్న భోజనం వంట ఖర్చులను (కుకింగ్ కాస్ట్) పెంచడంతో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించవచ్చని భావిస్తున్నారు. ధరల పెంపుతో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఒక్కొక్కరికి ఇప్పటి వరకు రూ.5.45 చెల్లిస్తున్నారు. డిసెంబరు నుంచి రూ.6.19, ఆరు నుంచి పదో తరగతి వరకు ఒక్కొక్కరికి రూ.8.17 నుంచి రూ.9.29 పెంచి చెల్లిస్తారు.

వచ్చే నెల పంచదార, కందిపప్పు అందజేత

భీమవరంటౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం తెల్లరేషన్ కార్డుదారులకు ప్రతీ నెల ఇచ్చే బియ్యంతోపాటు ఈ సారి పంచదార, కందిపప్పును అందించనున్నారు. జిల్లాలో ఐదు లక్షల 67 వేల రేషన్‌కార్డుదారులు ఉండగా వీరందరికి మూడు సరుకులు ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు. 80 శాతం పంచదార, కందిపప్పు అందుబాటులో ఉందని డీఎస్‌వో సరోజ తెలిపారు.

గల్ఫ్ దేశాలకు వెళ్లేవారు మోసపోవద్దు : ఎస్పీ



భీమవరం క్రైం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి):' విద్య, ఉద్యోగ, ఉపాధి, అవకాశాల కోసం జిల్లాలోని వివిధ వర్గాల ప్రజలు ఎక్కువగా గల్ఫ్ దేశాలకు వెళుతున్నా రు. ప్రజల అవగాహన రాహిత్యం వల్ల మధ్యవర్తుల చేతుల్లో మోసపోతున్నారు. ఇలా గల్ఫ్ దేశాలకు వెళ్ళాలనుకునే ప్రజలు, విద్యార్థులు ప్రభుత్వ గుర్తింపు పొం దిన సంస్థలు/వ్యక్తుల ఆధ్వర్యంలో చట్టపరమైన ఇమ్మి గ్రేషన్ ప్రక్రియ ద్వారా మాత్రమే విదేశీయానం చేయా లి. నకిలీ ఏజెంట్లు, సంస్థల ప్రతినిధుల గురించి ఏదైనా సమాచారం ఉంటే వెంటనే పోలీసు అధికారులకు సమాచారం అందిస్తే సదరు వ్యక్తులు/ప్రతినిధులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం' అని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి హెచ్చరించారు. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖచే నిర్వహించబడుతున్న ప్రొటెక్టర్ ఆఫ్ ఏ మైగ్రేంట్స్ నేతృత్వంలో విదేశీ ఉపాధి అవకాశాలు మరియు మోసాలు అనే అంశంపై గురువారం విష్ణు కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రొటెక్టర్ ఆఫ్ ఎమిగ్రేంట్స్ హైదరాబాద్ ప్రతినిధి ఎం.రవికుమార్ మాట్లాడుతూ ఎవరైనా నకిలీ ఏజెంట్లు/సంస్థల ప్రతినిధుల చేతుల్లో మోసపోతే తక్షణమే టోల్‌ఫ్రీ నెంబర్ 1800 113 090 లేదా 011-2688 5021కి కాల్ చేయాలని సూచించారు.



ఆసుపత్రులకు స్పెషలిస్టు వైద్యులు రావాలి : కలెక్టర్

భీమవరంటౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): 'జిల్లాలోని ప్రభుత్వాసుపత్రుల్లో మధ్యాహ్నం నుంచి స్పెషలిస్టులు రావడం లేదనే ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయి. శుక్రవారం నుంచి వీటికి స్వస్తి పలికేలా స్నేహపూరిత వైద్య సేవలను అందించాలి' అని కలెక్టరు చదలవాడ నాగరాణి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుంచి ఆర్డీవోలు, జిల్లాలో ప్రభుత్వ హాస్పటల్స్ సూపరింటెండెంట్లు, స్పెషలిస్టులు, వైద్యాధికారులతో కలెక్టరు, జేసీ టి.రాహుల్ కుమార్‌రెడ్డితో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు, అర్బన్ హెల్త్ సెంటర్లు ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు వరకు, జిల్లా హాస్పటల్, ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు మూడు షిఫ్టుల ప్రకారం 24 గంటలు పనిచేయాలని ఆదేశించారు.

విజన్-2047 రూపకల్పన

జిల్లాను ప్రత్యేకస్థానంలో నిలిపేలా విజన్-2047 డాక్యుమెంట్ రూపకల్పన ఉండాలని కలెక్టర్ నాగరాణి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులతో సమావేశమై విజన్-2047 డాక్యుమెంట్ రూపకల్పన, జిల్లాలో అమలవుతున్న కార్యక్రమాల ప్రగతి, రాష్ట్ర స్థాయిలో చర్చించాల్సిన, ఫ్లాగ్ చేయాల్సిన అంశాలపై సమీక్షించారు.

భీమవరంలో దొంగల ముఠా కలకలం

తొమ్మిది మంది అరెస్టు.. ముగ్గురు పరారీ

మారణాయుధాలు స్వాధీనం

పుట్టకుండానే అమ్మకానికి బిడ్డ

వైద్య ఖర్చులకు నగదు చెల్లింపు

డెలివరీ కావడంతో తీసుకెళ్లడానికి విజయవాడ నుంచి వచ్చిన మహిళ

అడ్డుకున్న పోలీసులు.. ఐసీడీఎస్ అధికారుల విచారణ - 7లో..

తుఫాన్ భయం



ఉండి మండలం చిలుకూరు రోడ్‌లో ఇరువైపులా ఆరబెట్టిన ధాన్యం

- ఉరుకులు పరుగులతో సార్వా మాసూళ్లు
- రెండు రోజులుగా మబ్బుల వాతావరణం
- తుఫాన్ వెళ్లే వరకు కోతలు కోయవద్దని అధికారుల సూచన
- జిల్లాలో 30 శాతానికిపైగా మాసూళ్లు
- 16,500 మంది లక్షా 12 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం విక్రయం
- రైతుల ఖాతాలకు రూ.250 కోట్లు జమ.. రూ.7 కోట్లు పెండింగ్



రైతులు అప్రమత్తంగా ఉండాలి : జేసీ

భీమవరం రూరల్/ఆచంట/తణుకు/ఉండి/పాలకొల్లు రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ కారణంగా వాతావరణం రెండు రోజులుగా మబ్బులు, మేఘాలతో పొడిగా ఉండటంతో రైతుల్లో గుబులు నెలకొంది. ఇప్పటికే అధికారులు తుఫాన్ వెళ్లే వరకు కోతలు వాయిదా వేసుకోవాలని రైతులకు సూచించారు. కోతలు పూర్తయిన పంటలకు సంబంధించి రైతులు తమ ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకునే పనుల్లో హడావుడిగా ఉన్నారు. దీంతో మాసూళ్లు అయిన ధాన్యం వెంటనే మిల్లులకు పంపిస్తున్నారు. వర్షాలు పడితే ఆ నారుమడులకు ఇబ్బంది ఉంటుందని రైతులు అంటున్నారు. పొలాల వద్ద కల్లాల్లో వున్న ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకునే పనులలో రైతులంతా నిమగ్నమయ్యారు. రైతులంతా ఎక్కడికి వెళ్లకుండా పంటను దక్కించుకోవాలనే తపనతో ఎవరికి వారు పొలాల వద్ద కాపలా ఉంటున్నారు. వాతావరణ శాఖ సూచనలతో పండిన వరి చేలను కోయకుండా అలాగే ఉంచాలని సూచిస్తున్నారు. సార్వాలో నిలిచిన 20 వేల ఎకరాల భూమిలో నారుమడులు వేసే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. దీంతో

కోత యంత్రాలపై ఏదీ పర్యవేక్షణ

వరి కోతలు కోసే యంత్రాలపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది గంటకు కోత కోసే యంత్రం వారు రూ.2,600 తీసుకుంటే అదే పనికి ఇప్పుడు రూ.3,000 తీసుకుంటున్నారు.

• రైతులకు అండగా వుండాలి



సార్వాలో పెట్టుబడులు అధికంగా పెట్టాల్సి వస్తోంది. వర్షాలు, తుఫాన్లతో రెండు, మూడుసార్లు నారుమడులను వేయాల్సి రావడంతో నష్టపోవాల్సి వస్తోంది. ఈ సమయంలో ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి. ఇన్‌పుట్ సబ్సిడీ అందించాలి. విత్తనాలు అందించడంలో, యంత్ర పరికరాలు సబ్సిడీపై ఇవ్వడంలో స్పందించాలి.

- గోపాలకృష్ణంరాజు, కిలారి తవిటయ్య, రైతులు

సార్వా పెట్టుబడులు రైతులకు అధికమైన విషయం అందరికీ తెలిసిందే. అయితే ఇటువంటి వాటివల్ల రైతులు నష్టపోతున్నారంటూ వారు వాపోయారు.

ఇన్‌పుట్ సబ్సిడి అందించండి

సార్వా ప్రారంభంలో నాట్లు వేసిన సమయంలో కురిసిన వర్షాలకు జిల్లాలో వరి నారుమడులు వర్షార్పణం జరిగింది. దీంతో ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడి ఇస్తామని ప్రకటించినా ఇంత వరకు అందించలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి నారుమడులను వేసి నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందించాలని కోరుతున్నారు.

ఇలా అమ్మకం.. అలా జమ

ఇలా ధాన్యం అమ్మితే.. రైతుల ఖాతాల్లో అలా డబ్బులు వచ్చి జమ అవుతున్నాయి. రైతులు సాగు మాసూళ్లు చేయడంలో ఎంత పరుగులు పెడుతున్నారో.. ధాన్యం విక్రయాల్లో అంతే స్పీడు పెంచుతున్నారు. ఒకపక్క వరి కోత యంత్రాలలో మాసూళ్లు, మరోపక్క ధాన్యం ఎండ బెట్టడంతో వెనువెంటనే అమ్మకాలు జరుగుతున్నాయి. జిల్లాలో లక్షా 95 వేల ఎకరాల్లో సార్వా సాగు జరిగితే ఇప్పటి వరకు 30 శాతానికి పైగా సాగు మాసూళ్లయ్యింది. లక్షా 12 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 16 వేల 500 మంది రైతులు విక్రయించారు. దీని నిమిత్తం రూ.257 కోట్లు రైతులకు అందించాల్సి ఉంది. ఇప్పటి వరకు రూ.250 కోట్లు రైతులు ఖాతాల్లో జమ అయ్యింది. ఇంకా రూ.7 కోట్లు మాత్రమే అందాల్సి ఉంది. ఈ ఏడాది సార్వానుంచి 4 లక్షల 10వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అధికారులు లెక్క వేశారు. ఇప్పటి లక్షా 12 వేల మెట్రిక్ టన్నులు కొనుగోళ్లు చేశారు. మిగిలిన మూడు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సొమ్ము ప్రస్తుతం ఇస్తున్న విధంగా 48 గంటల్లో ఇస్తేనే రైతులందరికీ ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం ఇచ్చినట్లు అవుతుందని రైతులు అంటున్నారు.

దాళ్వా సాగు ఏర్పాటు

ఓ వైపు సార్వా మాసూళ్లు చేస్తూనే, వచ్చే దాళ్వా సాగు ఏర్పాటులోను రైతులు నిమగ్నమయ్యారు. సార్వా ధాన్యం సొమ్ములు వెంటనే పడుతుండటంతో దాళ్వా సాగు విత్తనాలు కొనుగోలు నారుమడి దమ్ము పనులు చేస్తున్నారు. మెట్టలో 15 వేల ఎకరాల దాళ్వా సాగుకు నారుమడులు లేకుండా జరిగింది. డెల్టాలోను వచ్చే నెల 10లోపు దాళ్వా నారుమడులు వెయ్యాలనే ఆలోచనలో రైతులు ఉన్నారు.

తుఫాను ప్రభావంతో జిల్లాలో వర్షాలు పడే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని జేసీ టి.రాహుల్‌కుమార్ రెడ్డి తెలిపారు. పాలకొల్లు మండలంలోని పలు గ్రామాల్లో జేసీ గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా కళ్లాల్లోని ధాన్యాలను తడవకుండా చూసుకోవాలని రైతులకు సూచించారు. మిల్లుల వద్ద ప్రభుత్వ ప్రతినిధులుగా ఉన్న కస్టోడియన్ అధికారులు మిల్లుల వద్ద అందుబాటులో ఉండాలని ఆదేశించారు. వీలైనంత త్వరగా ధాన్యాన్ని మిల్లులకు తరలించాని ఆదేశించారు.

24 గంటల్లోనే జమ



నాలుగు రోజులు క్రితం సార్వా పంట మాసుళ్ళు చేశారు. రెండు రోజులు ధాన్యం ఎండబెట్టి అమ్మకం చేశాం. ధాన్యం అమ్మిన 24 గంటలకు సొమ్ము ఖాతాలో పడుతున్నాయి. ఇదే తరహాలో అందరి రైతులకు చివరి వరకు సొమ్ములు అందిం చాలి. అప్పుడు రైతులకు ఎంతో సహకారం అందించినట్లు వుతుంది. ట్రాక్టర్, కూలీలు, వరికోత యంత్రాలకు త్వరితగతిన సొమ్ములు ఇవ్వగల్గుతున్నారు. గతంలో సొమ్ములు ఆలస్యంగా రావడం వలన ఎన్నో ఇబ్బందులు పడ్డాము.

- బి.బాబ్జీ, గునుపూడి, వి.పుల్లారావు, తాడేరు, రైతులు

రోడ్లే కళ్లాలుగా

• కళ్లాలు లేక రైతుల ఇబ్బందులు

పూర్వం ఉండే ఉమ్మడి కళ్లాలకు పలువురు రైతులు స్వస్తి పలికారు. ప్రస్తుతం ఎక్కడ చూసిన జాతీయ రహదారులు, గ్రామాల్లోని సిమెంట్ రోడ్లనే కళ్లాలుగా మార్చేశారు. రైతులు పండించిన పంట ఒక ఎత్తయితే, దానిని ఒబ్బిడి చేయడానికి అవసరమైన ఖాళీ స్థలాలు లేకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలామంది భూమి ఉన్న రైతులు వ్యవసాయం సాగుచేయడం లేదు. చాలా వరకు కౌలు రైతులు వ్యవసాయం చేస్తున్నారు. దీంతో పొలాలల్లో గట్టును సైతం పొలాలుగా మార్చిన ఘటనలు చాలా వరకు ఉన్నాయి. దీంతో కళ్లాలు కనుమరుగయ్యాయి.

ఉమ్మడి స్థలం కేటాయించాలి

గతంలో మాదిరిగా కళ్లాలు అందుబాటులో లేకుండా పోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. వాతావరణ పరిస్థితులను బట్టి బరకాలు అందుబాటులో ఉంచుకుని పంటను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నాం. తర్వాత దేవుడి మీద భారం వేసి జాగ్రత్తగా ఒబ్బిడి చేసుకుంటున్నాం. అన్నిచోట్ల కళ్లాలు లేని పరిస్థితి. చాలా మంది రైతులు భూముల ధరలు పెరగడంతో ఉన్న వాటిని పొలాల్లో కలిపేసుకున్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఉమ్మడి స్థలం కేటాయించాలి.

- కోటేశ్వరరావు, దువ్వ, అప్పారావు, మండపాక



భీమవరం ప్రభుత్వాసుపత్రిలో రోగుల పాట్లు



రిసెప్షన్ కౌంటర్ వద్ద పేర్ల నమోదుకు..

బయట ల్యాబ్‌ల్లో.. కొన్ని రక్త పరీక్షలు

స్కానింగ్ యంత్రం ఉన్నా వైద్యుడు లేరు



రక్త పరీక్ష గది వద్ద క్యూ

భీమవరం క్రైం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): భీమవరం పట్టణంలోని ప్రాంతీయ ఏరియా ఆసుపత్రిలో రోగులకు కష్టాలు తప్పడం లేదు. ఎంతో దూరం నుంచి ప్రయాసపడి ఆసుపత్రికి వస్తే ఇక్కడి అరకొర వసతులతో సతమతమవుతున్నారు. భీమవరం పట్టణం, రూరల్, ఆకివీడు, కాళ్ళ, పాలకోడేరు, వీరవాసరం, మొగల్తూరు, కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలాల ప్రజలు రోజుకు 300 నుంచి 400 మంది వైద్యం కోసం ఆసుపత్రికి వస్తూంటారు. గర్భిణులు అధికంగానే ఉంటారు. నెలకు సుమారు 100 నుంచి 120 వరకు డెలివరీలు జరుగుతాయి. రోడ్డు ప్రమాదాలు, కుక్క, పాము కాట్ల బాధితులు వచ్చేది అధికమే. ఇలాంటి ప్రాంతీయ ఏరియా ఆసుపత్రిలో రక్త పరీక్షల విషయంలో ఇబ్బందులు తప్పడం లేదు. ఒక్క థైరాయిడ్ పరీక్ష తప్ప అన్ని రకాల రక్తపరీక్షలు అందుబాటులో ఉన్నా కొందరు సిబ్బంది చేతివాటం చూపిస్తున్నారు. కొన్ని పరీక్షలు బయట ల్యాబ్‌లకు పంపిస్తే వారిచ్చే కమిషన్ల కోసం కక్కుర్తి పడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. దీంతో రోగులు ఆ పరీక్షల కోసం బయట ల్యాబ్‌లకు వెళ్లి వేలల్లో ఖర్చు చేయాల్సి వస్తోంది. అసలే పేదరికంతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా వైద్యం అందిస్తారని, ఇక్కడకు వస్తే వారు బయటకు రక్త పరీక్షలకు పంపించడంలో కొందరు రోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని రకాల మందులు బయట మందుల దుకాణాల్లో కొనుగోలు చేసుకోవాలని సూచిస్తున్నారు.

స్కానింగ్ యంత్రం ఉన్నా డాక్టరు లేరు

భీమవరం ప్రాంతీయ ఏరియా ఆసుపత్రిలో అధునాతన స్కానింగ్ యంత్రం ఉన్నా సంబంధిత వైద్యులు లేకపోవడంతో బయట స్కానింగ్ సెంటర్లకు వెళ్ళి డబ్బులు వెచ్చించాల్సి వస్తోంది. గతంలో ప్రైవేటు వైద్యుడిని రప్పించి ఒక్కో స్కానింగ్‌కు రూ.200 ఇచ్చి స్కానింగ్ తీసేవారు. ప్రస్తుతం ప్రైవేటు వైద్యుడు రాకపోవడంతో బయట స్కానింగ్ సెంటర్లకు పంపిస్తున్నారు. చిన్న చిన్న స్కానింగ్‌లు మాత్రం ఆసుపత్రి వైద్యులు తీస్తున్నారు.

రిపోర్టులు మరుసటి రోజు

రక్త పరీక్షలు, ఎక్స్‌రేలు తీసిన తరువాత రిపోర్టుల కోసం మర్నాడు రమ్మనడం విశేషం. కొన్ని రకాల రక్త పరీక్షలు ఒక్క రోజులో పూర్తి కావని రోగులకు చెప్పడంతో వారు నిరుత్సాహ పడుతున్నారు. ఎంతో దూరం నుంచి ప్రయాసపడి, పనులు మానుకుని వస్తే మర్నాడు రమ్మనడంతో ఆవేదన చెందుతున్నారు. అత్యవసర కేసులకు మినహాయింపు ఇస్తున్నారు. రిపోర్టుల కోసం ఇబ్బందులు తప్పడం లేదని రోగులు వాపోతున్నారు.

కొన్ని రకాల స్కానింగ్‌లు తీస్తున్నాం



స్కానింగ్ యంత్రం ఉన్నప్పటికీ సంబంధిత వైద్యుడు లేకపోవడంతో స్కానింగ్ కోసం బయటకు పంపిస్తున్నాం. చిన్న చిన్న స్కానింగ్‌లు ఇక్కడ ఉన్న వైద్యులు తీస్తున్నారు. రక్తపరీక్షలు అన్ని రకాలు చేస్తున్నాం. థైరాయిడ్ రక్త పరీక్ష మాత్రం ఇక్కడ అందుబాటులో లేదు. రక్త పరీక్షలకు నలుగురు సిబ్బంది, ఒక వైద్యుని పర్యవేక్షణలో నిర్వహిస్తున్నాం. రిపోర్టులు మాత్రం కొంత సమయం పడుతుంది.

- మాధవి కళ్యాణి, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్

ఆ గన్ ఎవరిది ?

- ఎవరా ముగ్గురు యువకులు..
- కారులో అర్ధరాత్రి అనుమానాస్పద సంచారం..
- గస్తీ పోలీసుల తనిఖీలు.. నమోదు కాని కేసు

ఏలూరు క్రైం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి వేళ ఏలూరు నగరంలోని ఒక వీధిలో కారులో ముగ్గురు యువకులు అనుమానాస్పదంగా ఉండడంతో రాత్రి గస్తీ నిర్వహించే మహిళా ఎస్‌ఐకు అనుమానం రావడంతో చుట్టుముట్టారు. ఆ కారులో ముగ్గురు యువకులు ఉండడం వారి వద్ద ఒక గన్ ఉండడంతో అవాక్కయ్యారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకున్నారు. అయితే ఆ ముగ్గురు ఎవరు, ఆ ప్రాంతానికి అర్ధరాతి వేళ కారులో అక్కడ ఉండాల్సిన పరిస్థితి ఏమిటనే కోణంలో దర్యాప్తు చేపడుతున్న తరుణంలోనే రాజకీయ ఒత్తిడిలు వస్తున్నట్లు సమాచారం.

అత్యంత విశ్వసనీయ వర్గాల ద్వారా అందిన సమాచారం మేరకు ఏలూరు కొత్తపేట ప్రాంతంలో బుధవారం అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో ఒక కారు అనుమానాస్పదంగా ఆగి ఉండడం ఆ కారుపై నైటు గస్తీ నిర్వహించే మహిళా ఎస్‌ఐ తన సిబ్బందితో చుట్టుముట్టారు. ముగ్గురు యువకులు ఉండడం కారును తనిఖీ చేయగా ఒక గన్ ఉండడంతో అవాక్కయ్యారు. వెంటనే వారిని స్టేషన్‌కు తరలించారు. అది ఏ గన్ అన్నది పోలీసులు విచారణ జరపాల్సి ఉంది. అయితే ఏ గన్ అయినప్పటికీ అర్ధరాత్రి వేళ ఆ ముగ్గురు యువకులు కల్గి ఉండడం చట్టరీత్యా నేరం. అది ఏ గన్ అన్నది పోలీసులు ఎలాంటి ప్రయత్నం చేయలేదు. ఇది ఇలా ఉండగా రాజకీయ ఒత్తిళ్ళతో ఆ ముగ్గురిలో ఒక యువకుడిని పంపించి వేసినట్లు సమాచారం. ఆ ముగ్గురు ఏలూరు రూరల్ ప్రాంతానికి చెందనివారై ఉండి అర్ధరాత్రి వేళ 1.30 వేళ ప్రాంతంలో కొత్తపేట ప్రాంతంలో మాటువేసి ఉండడంతో పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఎవరినైనా కిడ్నాప్ చేయడానికి వచ్చారా ? బెదిరించడానికి వచ్చారా ? మరే ఇతర కారణాలు ఉన్నాయా ? అనే విషయాలను పోలీసులు బహిర్గతం చేయాల్సి ఉంది. ఆ గన్ కథ ఏమిటో ఉన్నతాధికారులే తేల్చాలి. ఏలూరు నగరంలో ఈ సంఘటనతో నగరంలో ఒక్కసారిగా నగర ప్రజలు ఉలిక్కిపడ్డారు. ఏలూరు టూటౌన్ ప్రాంత పరిధిలో హోటల్‌లో ఒక వ్యక్తిని బెదిరించి, కిడ్నాప్ చేసి ఊరు చివరకు తీసుకువెళ్ళి గాలిలో కాల్పులు జరిపిన సంఘటనలు ఉన్నాయి. అయితే ఆ కేసులో నకిలీ ఐపీఎస్ అధికారిని, అతని ముఠాను అరెస్టు చేశారు. ప్రస్తుతం ఈ ముగ్గురు ఎవరు, ఎందుకు ఆగన్ కలిగి ఉన్నారనేది ఉన్నతాధికారులే తేల్చి ప్రజల్లో ఉన్న భయభ్రాంతులను తొలగించాల్సి ఉంది.



నివాళులర్పిస్తున్న మంత్రి నిమ్మల,



చంద్రబాబుతో డిప్యూటీ స్పీకర్ రఘురామ,ఆయన తనయుడు

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోదరుడు, మాజీ ఎమ్మెల్యే రామమూర్తినాయుడు పెదకర్మ చిత్తూరు జిల్లా నారావారిపల్లిలో గురువారం జరిగింది. ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, మంత్రులు, ప్రజాప్రతినిధులు, నారావారిపల్లి వెళ్లి నివాళులర్పించారు.. చంద్రబాబును, రామ్మూర్తినాయుడు కుమారులను పరామర్శించారు..



కొత్తపల్లి సుబ్బారాయుడు

చిన వెంకన్న హుండీ ఆదాయం రూ.1.84 కోట్లు

ద్వారకాతిరుమల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల శ్రీవారికి ఆలయ హుండీల ద్వారా మంచి ఆదాయం సమకూరింది. 17 రోజుల కాలానికి గాను జరిగిన ఈ లెక్కింపులో రూ1.84 కోట్లరూపాయల ఆదాయం లభించినట్లు ఈవో ఎన్వీ సత్యన్నారాయణమూర్తి తెలిపారు. ప్రమోద కల్యాణమండప ఆవరణలో గురువారం భద్రతాఏర్పాట్ల నడుమ హుండీల లెక్కింపు నిర్వహించారు. 1,84,31,118 రూపాయల నగదుతో పాటు భక్తులు సమర్పించిన కానుకల రూపేణా 381 గ్రాముల బంగారం, 4.485 కేజీల వెండి లభించిందన్నారు. రద్దయిన పాతనోట్లు రూ.500 (2),1000(1) 2000(4)తో పాటుగా విదేశీ కరెన్సీ లభించింది.



లెక్కింపు నిర్వహిస్తున్న సిబ్బంది



ఆచార్య సుధాకర్‌ను సన్మానిస్తున్న పెనుగొండ కళాశాల అధ్యాపక బృందం

కమ్మనైనది.. తెలుగు భాష

నన్నయ్య యూనివర్శిటీ రిజిస్ట్రార్ ఆచార్య సుధాకర్

పెనుగొండ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): భాషల్లో తెలుగు భాష కమ్మనైనదని నన్నయ్య యూనివర్శిటీ రిజిస్ట్రార్ ఆచార్య సుధాకర్ అన్నారు. పెనుగొండ ఎస్‌వీకేపీ కళాశాలలో అంతర్జాతీయ తెలుగు సదస్సు ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వాసిలి వసంత కుమార్ రాసిన పుస్తకాలు సమాజాన్ని, తెలుగు లోకాన్ని ఎంతో ప్రభావితం చేస్తాయని ఆయన రచన శైలి అద్భుతమని సాహిత్యాన్ని పరిశోదన దిశగా తీసుకోవాలని ఆయన కోరారు. ఇలాంటి గొప్ప రచయితలు తమ కళాశాలకు రావడం అదృష్టమన్నారు. కళాశాల సెక్రటరీ ,కరస్పాండెంట్ డాక్టర్ కలిదిండి రామచంద్ర రాజు మాట్లాడుతూ తెలుగు భాష పట్ల పుస్తక పఠన పట్ల ఆసక్తి ఏర్పరచుకోవాలన్నారు. ప్రస్తుత కాలంలో పఠనాసక్తి తగ్గిపోతుందన్నారు. ఆసక్తిని పెంపొందించే దిశగా భాషాభివృద్ధి జరగాలన్నారు. అణుశక్తి శాస్త్రవేత్త జీవీజీకె మూర్తి మాట్లాడుతూ తెలుగుభాషను అభివృద్ధి చేయాలంటే అందరం కలిసికట్టుగా సైనికుల్లా పని చేయాలన్నారు. తెలుగు భాషకు తమ సేవలు అందించిన డాక్టర్ రంకిరెడ్డి రామ్మోహనరావు, కేవీ ఎండీ వరప్రసాద్‌లను అభినందించారు. అనంతరం వనపర్తి సత్యనారాయణ వాసులు సాహిత్యాన్ని గేయాల రూపంలో ఆల పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సంకురాత్రి సూర్యనారాయణ, తెలుగు విభాగ అధ్యాపకులు ఆదిషా, సురేష్, సుబ్బారావు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా సెంటర్లు నిర్వహిస్తే చర్యలు తప్పవు : డీఎంహెచ్‌వో

భీమవరం టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ అనుమతులు లేకుండా ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్‌లు, ఫిజియోథెరపీ సెంటర్‌లు, డియాగ్నోస్టిక్ సెంటర్ లు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు హెచ్చరిం చారు. ఆకస్మిక తనిఖీలు నిర్వహించి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నట్లుగా గుర్తిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ నిబం ధనల మేరకు అన్నీ అనుమతులు తీసుకొని ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొని వైద్య ఆరోగ్య శాఖ అనుమతులు పొందాలని, రెన్యు వల్ రిజిస్ట్రేషన్ గడువులోగా నమోదు చేసుకో వాలన్నారు. ఆసుపత్రి ఆవరణలో పరిశుభ్రత రోగులకు చికిత్సలకు అవసరమైన సదు పాయాలు, తాగు నీరు ఆసుపత్రి రికార్డులు, రిజిస్టర్ నిర్వహణ వివిధ పరీక్షల ఫీజు ధరల పట్టికను అందరికీ కనబడే విధంగా ప్రదర్శించాలని, అగ్నిమాపక రక్షణ పరికరాల నిర్వహణ నైపుణ్యంపై సిబ్బంది అంద రికీ అవగాహన కల్పించాలని చెప్పారు. నోటిఫైడ్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా, కుక్క కాటు, పాము కాటు, వివరాలు నిర్దేశిం చిన హెచ్ఐఎంఎస్ పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాల న్నారు. పౌర రిజిస్ట్రేషన్ వ్యవస్థ సవరణ చట్టం ప్రకారం అన్ని ప్రైవేట్ ఆసుపత్రులు జననాలు, నిర్జీవ జననాలు, మరణాలను సకా లంలో నమోదు చేయాలని చెప్పారు. చట్టాన్ని ఉల్లం ఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ఆర్జీయూకేటీ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

నూజివీడు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) :ఐఐటీ హైదరాబాద్‌తో కలిసి ఆర్జీయూకేటీ రోబోటిక్స్ ఫర్ అటానమస్ నావిగేషన్ సిస్టమ్స్‌పై స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తు న్నట్లు ఆర్జీయూకేటీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎం.విజయ్ కుమార్, యూనివర్శిటీ రిజిస్ట్రార్ ఎస్.అమరేంద్ర కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించి గోడ పత్రికను వారు గురువారం ఆవిష్కరిం చారు. అనంతరం వారు మాట్లాడుతూ డిసెంబర్ 10వ తేదీ నుంచి 14 వరకు ఈ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను నిర్వహించటం జరు గుతుందని, ఇందులో 50మంది అధ్యాపకులకు శిక్షణ కార్యక్రమం ఉంటుందని, అనంతరం 400 మంది విద్యార్థుల కోసం నాలుగు క్యాంపస్‌లలో శిక్షణ అందించేందుకు ఈ అధ్యాపకులు కృషి చేస్తారన్నారు. ఈ స్కిల్‌డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ లో పాల్గొనే విద్యార్థులు 9949860571 నంబర్‌లో సంప్రదించవచ్చని వారు తెలిపారు.



డిసెంబరులో గట్టి మేళం





మూఢం కారణంగా రెండు నెలలుగా మూగబోయిన పెళ్లి పందిళ్లలో డిసెంబర్ నుంచి గట్టి మేళం మోగనుంది.ఈ డిసెంబర్‌లో భారీగా పెళ్లిళ్లు ఫిక్స్ అయ్యాయి. దీంతో ఇటు పెళ్లి మండపాల నుంచి ఆలయ మండపాల వరకూ బుక్ అయ్యాయి. సన్నాయి మేళం నుంచి కేటరింగ్ వరకూ ఖాళీలేదనే మాటలు వినిపిస్తున్నాయి. కొందరు ముందు జాగ్రత్తగా కల్యాణ మండపాలు, సన్నాయి మేళాలు, ముఖ్యంగా పెళ్లి చేసే పురోహితులను బుక్ చేసుకున్నారు. జిల్లాలో ఉన్న వందలాది కల్యాణ మండపాలు, ప్రసిద్ధ దేవాల యాలు, ఆలయ మండపాలతో పాటు ఇళ్ల వద్దే మండపాలు వేసుకుని వివాహాలు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

మార్గశిరంలో మెండుగా పెళ్లిళ్లు

ఒక్కటి కానున్న కొత్త జంటలు

పెళ్లిళ్లకు ముహూర్తం ఫిక్స్

కల్యాణ మండపాలన్నీ ఫుల్

పురోహితులు, భజంత్రీలు, కేటరింగ్ సర్వీసుకు డిమాండ్

ద్వారకాతిరుమల/ తాడేపల్లిగూడెం రూరల్ నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఈ మార్గశిర మాసంలో మూడుముళ్ల బంధంతో పలు జంటలు ఒక్కటి కానున్నాయి. కార్తీకంలో అంతంత మాత్రంగా పెళ్లిళ్లు జరగ్గా మార్గశిరంలో అధికంగా జరుగనున్నాయి. డిసెంబరు 4 నుంచి పెళ్లిళ్లు భారీగా జరుగనున్నాయి. వచ్చే నెల 4 నుంచి 25 వరకూ వివాహాలకు మంచి ముహూర్తాలే ఉన్నాయని పురోహితులు చెబుతున్నారు. డిసెంబరు 4, 7, 14, 15 తేదీల్లో ముహూర్తాలు మంచివని పండితులు వివరిస్తున్నారు.

పెళ్లి పనుల్లో బిజీ

ముహూర్తాలకు తగ్గట్టే పెళ్లిళ్లు వందల సంఖ్యలో జరుగనుండటంతో ఇప్పటికే జిల్లాలో చాలా వరకు కల్యాణమండపాలు బుక్ అయ్యాయి. ప్రధానంగా ద్వారకాతిరుమల క్షేత్రంలో ఈ ముహూర్తాల్లో ఎన్నో పెళ్లిళ్లు జరుగనున్నాయి.ఈ క్రమంలో ఇప్పటికే చాలా వరకు గదులు, సత్రాలు, కాటేజీలు. కల్యాణమండపాలు బుక్ అయ్యాయి. అలాగే కేటరింగ్, పచ్చిపూల మండపాలు, అలంకరణ, లైటింగ్, బాజా భజంత్రీలు, ట్రావెల్స్, పురోహితులకు మంచి డిమాండ్ కనిపిస్తున్నది. పెళ్లిబృందాల వారు తమ ఏర్పాట్లలో బిజీగా ఉన్నారు.

మండపాలు ఫుల్..

రెండు నెలలుగా ముహూర్తాలు లేకపోవడంతో ఒక్క సారిగా పెళ్లి ముహూర్తాలు ఉండటంతో డిసెంబర్ నెలలో కల్యాణ మండపాలు దొరక్క పెళ్లి పెద్దలు తలలు పట్టుకుంటున్నారు. దీనికి తోడు డిసెంబర్ నెలలో బలమైన ముహూర్తాలు కావడంతో ఆ ముహూర్తాలతో కళ్యాణ మండపాల ధరలు భారీగా పెంచేశారు. మండపాల ధరలు డిమాండ్‌ను బట్టి రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకూ పెంచేశారు. మండపాలలో పూల డెకరేషన్ కోసం భారీగా వెచ్చించాల్సిన పరిస్థితి. రూ.50 వేల నుంచి రూ.4 లక్షలకు పైగా డిమాండ్‌ను బట్టి పలుకుతున్నాయి. పురోహితులు దొరక్క చాలా మంది ఇబ్బంది పడుతున్నారు. ఒక వేళ పురోహితులు దొరికినా వేలల్లో చదివించుకోవాల్సిన పరిస్థితి. దీంతో సామాన్యులకు పెళ్లిళ్ల ఖర్చు చాలా భారంగానే మారింది..



ముహూర్తాలివీ

డిసెంబరు 4వ తేదీరాత్రి 8.01,
తెల్లవారు జామున 4.39 గంటలకు
5 రాత్రి గం. 7.57 ని.లకు, తె.4.34 ని.లకు
6న రాత్రి 1.38కు, తె.4.30లకు,
7 రాత్రి 7.49, గం.8.32. తె.1.34 తె.4.29
8న రాత్రి 8.28 ని.లకు,
11 రాత్రి 8.16, తె.4.10లకు
12న రాత్రి 8.12 లకు
14 రాత్రి 8.04, తె.1.06, తె.4.29 ని.లకు
15న రాత్రి 8.00, తె.1.02 ని.లకు మంచి ముహూర్తాలు ఉన్నాయి..

ఈనెల 20న తె.3.36 ని.లకు, 22న రాత్రి గం.12.36 ని.లకు, తె.4.24 ని.లకు, 25న 12.24, తె.4.12 ని.లకు ముహూర్తాలు ఉన్నాయని పండితులు చెబుతున్నారు.

అందరికీ తగిన ముహూర్తాలు

ఈ మార్గశిరంలో అన్ని నక్షత్రాల వారికి తగిన బలమైన ముహూర్తాలున్నాయి. వచ్చేనెలలో 4, 7, 14, 15 న మంచి ముహూర్తాలు.తరువాత నెల పుష్యమి కావడంతో శూన్యమాసంగా చెబుతాం. పెళ్లిళ్లు జరుగవు. దీంతో ఆయా ముహూర్తాల లోనే ఈ మార్గశిరంలో ఎక్కువగా పెళ్లిళ్లు జరుగుతాయి. వచ్చేనెల 4 నుంచి 15 వరకూ దివ్యమైన ముహూర్తాలున్నాయి. తరువాత 20, 22, 25న పెట్టుడు ముహూర్తాలు ఉన్నాయి.

- గోవిందవఝుల వెంకట రమణమూర్తి శర్మ,పురోహితుడు, ద్వారకాతిరుమల







క్రీడాజ్యోతి వెలిగిస్తున్న ఏపీఆర్‌జేసీ కార్యదర్శి ప్రసన్న వెంకటేష్.. ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

క్రీడలతో వ్యక్తిత్వ వికాసంతో పాటు ఆత్మ విశ్వాసం

ఏపీఆర్‌జేసీ రాష్ట్ర క్రీడాపోటీలు ప్రారంభించిన కార్యదర్శి ప్రసన్న వెంకటేష్

పెదవేగి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తిత్వ వికాసంతో పాటు విద్యార్థిలో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించడానికి క్రీడలు దోహదపడతాయని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ (ఏపీఆర్‌జేసీ) కార్యదర్శి వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. పెదవేగిలోని గురుకుల విద్యాలయంలో నిర్వహించనున్న ఏపీఆర్‌జేసీ విద్యాలయాల రాష్ట్రస్థాయి క్రీడాపోటీలను సంస్థ కార్యదర్శి ప్రసన్న వెంకటేష్ గురువారం ఉదయం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో శారీరక ధృడత్వాన్ని పెంచి, మానసిక వికాసానికి దోహదపడతాయన్నారు. ప్రతి విద్యార్థి విద్యతోపాటు క్రీడలకు సమప్రాధాన్యం ఇవ్వాలని, అప్పుడే విద్యార్థి ఔన్నత్యం పెరుగుతుందని చెప్పారు. ఉపాధ్యాయులు క్రీడలపట్ల ఆసక్తి కలిగిన విద్యార్థులను గుర్తించి మరింత ప్రోత్సహించాలన్నారు.

టీవీలు, వీడియో గేమ్స్, స్మార్ట్ ఫోన్లల ప్రస్తుత కాలంలో శారీరక శ్రమ తగ్గడంతో శారీరక ధృఢత్వం లేక ఆరోగ్య సమ స్యలు కూడా చుట్టుముడుతున్నాయని చెప్పారు. విద్యార్థి ఉన్నత భవిష్యత్‌కు బాటలు వేస్తాయని, స్థిరమైన జీవితాన్ని ఏర్పరచుకోవడానికి క్రీడలు వేదికగా నిలుస్తాయని చెప్పారు. ఈ క్రీడా పోటీలకు రాష్ట్రంలోని నాలుగు జోన్లనుంచి 1200 మంది విద్యార్థులు హాజరయ్యారని సంస్థ రాష్ట్ర క్రీడా సమన్వయాధికారి కె.జయరాజు తెలిపారు. తొలుత క్రీడాకారుల గౌరవ వందనాన్ని ప్రసన్న వెంకటేష్ స్వీకరించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పోలసానిపల్లి గురుకుల విద్యాలయం విద్యార్థినుల బ్యాండ్ ట్రూప్, ఆరుగొలను విద్యార్థుల బ్యాగ్ పైపర్ బ్యాండ్‌ట్రూప్‌లు ఈ పోటీల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సంస్థ అకడమిక్ మానటరింగ్ అధికారులు ఎన్.సంజీవరావు, ఎ.మురళీకృష్ణ, బీవీ.మల్లేశ్వరరావు, ఏలూరు, తూర్పుగోదావరి, కృష్ణాజిల్లాల సమన్వ యాధికారులు ఎస్.భారతి, జి.వెంకటరావు, కె.ప్రేమావతి, పెదవేగి గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వరరావు మూడు జోన్ల సమన్వయాధికారులు, ఆయా పీడీలు పాల్గొన్నారు.





ఉత్సాహంగా కిడ్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీలు

ఏలూరు రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆటల్లో చిన్నారుల ప్రతిభను వెలికి తీయడంలో భాగంగా గురువారం ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల మొదటి కిడ్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఉత్తమ ఉపాధ్యాయులు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు జెల్లా వీరభద్రరావు పుట్టినరోజును పురస్క రించుకుని పోటీలను ఉత్సాహంగా నిర్వహించారు. సుమారు 500 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్-8 నుంచి 18 వయసు విభాగాల బాలబాలికలు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పిల్లలకు చిన్న వయసు నుంచే క్రీడలపట్ల ఆసక్తి పెరగడానికి కిడ్స్ అథ్లెటిక్స్ ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. రాష్ట్ర పోటీల్లో కూడా పాల్గొని పతకాలు గెలుపొంది జిల్లా ఖ్యాతిని రాష్ట్ర స్థాయిలో నిలపాలని తెలిపారు. ఈ పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ విన్నర్‌గా ఏలూరు సెయింట్ థెరిస్సా గరల్స్ హైస్కూల్ విద్యార్థులు విజయం సాధించగా, కైకరం జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ విద్యార్థులు రన్నర్‌గా నిలిచారు. అసోసియేషన్ కార్యదర్శి దేవరపల్లి ప్రసాద్ పర్యవేక్షించారు.



ప్రారంభ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంటి

క్రీడా కోటా 3 శాతం

క్రీడాకారుల్లో హర్షాతిరేకాలు

ఏలూరు రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఉద్యోగాల్లో క్రీడా కోటాను మూడు శాతానికి పెంచుతూ నిర్ణయం తీసు కోవడంపై క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో రెండు శాతంగా ఉన్న ఈ కోటాను ఇప్పుడు మూడు శాతానికి పెంచారు. దీనివల్ల క్షేత్రస్థాయిలో క్రీడాపోటీలకు హాజ రయ్యే వారికి మంచి అవకాశాలు లభించనున్నాయి. జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి అనేకమంది క్రీడా కారులు రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎంపికవుతుండగా మరి కొందరు అంత ర్జాతీయ స్థాయిలోనూ తమ సత్తా చాటుతున్నారు. వైసీపీ హయాంలో కనీస సౌకర్యాలు కల్పించక పోవడంతో క్రీడాకారులకు సరైన ప్రోత్సాహకాలు కరువయ్యాయి. కూటమి ప్రభుత్వం తిరిగి క్రీడలకు పూర్వ వైభవం కల్పించి క్రీడాకారులను ప్రోత్సాహం అందజేయాలని నిర్ణయిం చింది. గ్రామీణ క్రీడలను ప్రోత్సహించేందుకు ఇటీవల ప్రభుత్వం స్కూల్ గేమ్స్ నిర్వహిం చింది. వాలీబాల్, క్రికెట్, ఖోఖో, కబడ్డీ, టెన్నిస్, అథ్లెటిక్స్, బాల్‌బ్యాడ్మింటన్, చెస్ వంటి క్రీడల్లో తమ సత్తా చాటుకున్నారు. నూతన క్రీడావిధానంతో క్రీడలకు పూర్వ వైభవం వస్తుందని క్రీడానిపుణులు భావిస్తున్నారు. పారా స్పోర్ట్స్‌తో పాటు అంధులకు సంబంధించి క్రీడలకు ప్రోత్సాహం ఇస్తామని పేర్కొంది. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయివరకు క్రీడా మైదా నాలు ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రక టించడంతో క్రీడాకారుల్లో ఉత్సాహం నెలకొంది.

ఉత్సాహాన్ని ఇచ్చింది

ఆకాష్ సుందర్, క్రీడాకారుడు

చదువుతో పాటు క్రీడల్లో ఆసక్తిచూపుతూ క్రీడల్లో రాణిస్తున్న విద్యా ర్థులకు చంద్ర బాబు పెంచిన మూడుశాతం కోటాతో క్రీడల్లో మరింత రాణించాలనే ఉత్సాహం కలుగుతోంది. ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుంది.



సద్వినియోగం చేసుకోవాలి

పీడీ పద్మలత

క్రీడల్లో మూడుశాతం కోటాను ప్రతి క్రీడాకారుడు సద్వినియో గించుకోవాలి. ఈ నిర్ణయంతో పాఠశాల స్థాయిలో రాణిస్తున్న క్రీడాకా రులను తీర్చిదిద్దడానికి మరింత అవకాశం కలిగింది. క్రీడల్లో రాణిస్తే ఉద్యోగ అవకాశాలు వస్తాయి.



బీరువా భద్రం..

కుముదవల్లి గ్రామంలోని 128 సంవత్సరాలు కలిగిన గ్రంథాలయానికి ఎంత పేరుందో ఆ గ్రంథాలయంలో ఉన్న అతిపురాతన చెక్క బీరువాకి కూడా అంతే విలువుంది. ఓల్డీజ్ గోల్డ్ అన్న చందంగా ఆ గ్రంథాలయంలో 87 సంవత్సరాలు కలిగిన చెక్క బీరువా కూడా నేటికి అంతే సుందరంగా ఉంది. గ్రామానికి చెందిన కోడి రామమూర్తి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు 1937 సంవత్సరంలో గ్రంథాలయానికి ఈ చెక్క బీరువాను బహూకరించారు. అప్పట్లో చెక్క బీరువాలను ఎంతో అపురూపంగా చూసుకునేవారు. అ చెక్క బీరువాల్లోనే విలువైన సామాగ్రి పెట్టుకునే వారు. కుముదవల్లి గ్రంథాలయంలో ఈ చెక్క బీరువాను కూడా అంతే అపురూపంగా చూసుకుంటూ పుస్తకాలను ఈ బీరువాలోనే భద్రపరుస్తుండే వారు. అనాటి నుంచి నేటి వరకు గ్రంథాలయ పాలకులు ఈ బీరువాను జాగ్రత్తగా చూసుకుంటూ ఆ నాటి జ్ఞాపకాన్ని పదిల పరుస్తూ ఆ గ్రంథాల యానికి వచ్చే ప్రతీ ఒక్కరికి బీరువా ప్రాముఖ్యత చాటి చెప్పుతున్నారు.

-పాలకోడేరు



గుర్తుందా మీకు..!

నాడు పల్లెల్లో రైతు ఇంట రాజసం..

వ్యవసాయానికి తోడు

నేడు యాంత్రీకరణతో కనుమరుగవుతున్న ఎండ్ల బండ్లు



జోడెడ్ల బండి గుర్తుందా.. నాడు గ్రామాల్లో రైతుల ఇంట ఉండేవి. అప్పట్లో మంచి ఎడ్లజత బండి ఉండటం సామాజిక హోదాగా భావించే వారు. రైతు కుటుంబాలు ఎడ్లను కన్నబిడ్డల్లా, బండిని జాగ్రత్తగా చూసుకునేవారు. పల్లెటూర్లలో ఎడ్ల బండిపై వెళుతూ మంచి అనుభూతిని పొందేవారు. పూర్వం రైతులకు చేదోడుగా ఉన్న ఎడ్ల బండ్లు యాంత్రిక విప్లవంతో కనుమరుగవుతున్నాయని ఆ తరం రైతులు చెబుతున్నారు. పశువుల ఎరువు పొలాలకు తరలించడం,వ్యవసాయ పనుముట్లు సాగు భూముల్లోకి తీసుకు వెళ్లేందుకు, పంటలు, వరిగడ్డి ఇళ్ళకు తెచ్చుకోవటానికి ఎడ్లబండ్లనే ఉపయోగించేవారు. ఎడ్లబండి లేకుండా వ్యవసాయం నడిచేది కాదు. ఇంకా పెళ్ళికు,తీర్థయాత్రలకు ఎడ్లబండ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచేవి. వీధిలో ఒక ఇంట్లో పెళ్ళి అయితే ఆ వీధిలో ఉండే ఎడ్లబండ్లు అన్నీ కట్టి తంతుకు తమ వంతు సహకారం అందించే వారు. క్షేత్రాలకు వెళ్లాలంటే గూడు కట్టి ఎండ్ల బండ్లను అలంకరించి వాటిలోనే ప్రయాణించేవారు.

ట్రాక్టర్లు వచ్చాక ...బండ్లు మాయం

వ్యవసాయంలోకి ట్రాక్టర్లు వచ్చాక ఎడ్లబండ్లు వాడకం క్రమంగా తగ్గుతూ వచ్చింది. 25 ఏళ్ల క్రితం వరకు గ్రామాల్లో భూస్వాములకు, పెద్ద రైతులకు మాత్రమే ట్రాక్టర్లు ఉండేవి. చిన్న రైతులు ఎండ్లబండితోనే వ్యవసాయం చేసుకునే వారు. వ్యవసాయ యాంత్రీకరణకు ప్రాధాన్యం ఇవ్వడంతో గ్రామాల్లో వ్యవసాయ సహకార పరపతి సంఘాలు, బ్యాంకులు రైతులకు ట్రాక్టర్లు కొనుగోలుకు రుణాలు ఇవ్వడంతో అన్ని ఊర్లలో ట్రాక్టర్ల సంఖ్య బాగా పెరిగింది. వ్యవసాయ పనులన్నిటికి ట్రాక్టర్లు అందుబాటులోకి వచ్చాయి. పశు గ్రాసం, కూలీల కొరత, తదితర కారణాల వలన రైతులకు పశుపోషణ భారమైంది. దాదాపు రైతులందరూ పశువులను అమ్మి వ్యవసాయ పనులన్నీ కిరాయి ట్రాక్టర్లతో చేయించుకుంటున్నారు. దీనితో ఎడ్లబండ్లకు కాలం చెల్లుతున్నది. ప్రస్తుతం చాట్రాయి మండలంలోని 18 గ్రామాల్లో కేవలం 10 ఎడ్లబండ్లు మాత్రమే మిగిలి ఉన్నాయి.

- చాట్రాయి

హేచరీలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలి

» మంత్రిని కలిసిన ఆక్వా రైతులు


రైతులతో మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి

భీమవరం టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : నాణ్యమైన విద్యుత్‌ను హేచరీలకు సరఫరా చేయాలని విద్యుత్ శాఖామంత్రి గొట్టిపాటి రవి కుమార్‌ను తూర్పుగోదావరిజిల్లా నుంచి వచ్చిన ఆక్వా రైతులు కోరారు. గురువారం భీమవరం వచ్చిన ఆయనను కలసి సమస్యలు చెప్పుకున్నారు. విద్యుత్ సరఫరాలో వస్తున్న ఇబ్బందులను ఆయనకు వివరించారు. సీజనల్ సబ్సిడీపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరిన పలు హేచరీల యాజమానులు కోరారు. ఈ సందర్భంగా మంత్రి రవికుమార్ మాట్లాడుతూ నాణ్యమైన విద్యుత్ సరఫరాకు రైతులకు హామీ ఇచ్చారు. లోడ్ ఎక్కువగా ఉన్న ప్రాం తాలపై దృష్టి పెట్టాలని అధికారులకు మంత్రి సూచించారు. విద్యుత్ సరఫరా అవసరానికి తగినట్లు కొత్త సబ్ స్టేషన్లను గుర్తించాలని అధికారులకు ఆదేశించారు. హేచరీల యాజమానులపై ఆర్థిక భారం పడకుండా సమస్యపై నివేదిక కోరారు. దీనిపై ఇప్పటికే అసెంబ్లీలో చర్చించినట్లు రైతులకు వివరించారు. త్వరలోనే ఆక్వా రైతుల సమస్యలపై సరైన నిర్ణయం తీసుకుంటామన్నారు. అదే విధంగా దెయ్యాల తిప్ప మచ్చగడదిబ్బనుంచి వచ్చిన పలువురు రైతులు మాట్లాడుతూ తమ చెరువులకు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసుకోవాలంటే అధిక భారం కావటంతో ఇబ్బందులు పడుతున్నామని అందు వల్ల ఒక ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ముగ్గురు రైతులకు కనెక్షన్ ఇచ్చేలా చూడాలని కోరారు. దీనిపై ఆలోచన చేస్తామని హామి ఇచ్చారు. మంత్రితోపాటుగా జిల్లా ట్రాన్స్‌కో ఎస్ఈ రఘునాథ బాబు, ఈఈ వెంకటేశ్వరరావు, నరసాపురం డీఈ మధుకుమార్, తూర్పుగోదావరిజిల్లా పెద్దాపురం డీఈ ప్రభాకరం, జగ్గంపేట డీఈ వీరభద్రం పాల్గొన్నారు.

నేటి నుంచే బి ఫార్మసీ కౌన్సెలింగ్

భీమవరం ఎడ్యుకేషన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బి ఫార్మసీలో చేరేందుకు ఏపీఈఏపీ సెట్ 2024 ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు శుక్రవారం నుంచి కౌన్సెలింగ్ మొదలుకానుంది. ఎంపీసీ విద్యార్థులకు ఒకసారి కౌన్సెలింగ్ బైపీసీ విద్యార్థులకు మరోసారి కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉంది. అలాంటిది ఈ ఏడాది కౌన్సెలింగ్ ఆలస్యం అవడం వలన రెండు గ్రూపుల విద్యార్థులకు ఒకే సారి కౌన్సెలింగ్‌ను ప్రభుత్వం ప్రకటించింది. అయితే ముందు మూడు రోజులు ఎంపీసీ విద్యార్థులకు ఫీజు చెల్లింపు మొదలై కళాశాలల ఎంపిక చేసేలా అవసరం ఇచ్చారు. బైపీసీ వారికి 7రోజులు కౌన్సెలింగ్ సాగనుంది. రెండు గ్రూపులకు తేదీలు వారీగా ఈనెల 29న మొదలైన కౌన్సెలింగ్ ఆప్షన్ మార్పు డిసెంబర్ 8వ తేదీతో ముగుస్తుంది. సీట్లు కేటాయింపు ఎంపీసీ విద్యార్థులకు 4వ తేదీన జరుగుతుంది. బైపీసీ విద్యార్థులకు 11 తేదీన కేటాయిస్తారు.

ఎంపీసీ కౌన్సెలింగ్ ఇలా..

కౌన్సెలింగ్‌లో ఆన్‌లైన్‌లో విద్యార్థులు ఈనెల 29, 30 తేదీలలో ఫీజు చెల్లింపు చేయాలి. సర్టిఫికెట్స్ పరిశీలన ఈనెల 29 నుంచి వచ్చేనెల 1వ తేదీ వరకు చేసుకోవాలి. ఇదే తేదీలలో కళాశాలల ఎంపిక చేసుకోవాలి. ఒక వేళ కళాశాల మార్చుకోవాలంటే 2వ తేదీన మార్పుచేసుకోవచ్చు. 4వ తేదీన సీట్లు కేటాయిస్తారు. 4వ తేదీ నుంచి 6వ తేదీ వరకు ఎంపికైన కళాశాలలో రిపోర్ట్ చేసుకోవాలి. 5వ తేదీ నుంచి కళాశాలలో తరగతులు ప్రారంభం అవుతాయి.

బైపీసీ కౌన్సెలింగ్ ఇలా..

ఈనెల 30 తేదీ నుంచి వచ్చే నెల 5 తేదీ వరకు ఫీజు చెల్లింపులు చేసుకోవాలి. వచ్చే నెల 2 తేదీ నుంచి 6 వరకు సర్టిఫికెట్స్ పరిశీలన ఉంటుంది. 3వ తేదీ నుంచి 7 వరకు కళాశాలల ఎంపిక ఆప్షన్ చేసుకోవాలి. 8వ తేదీన ఆప్షన్ మార్పు చేసుకోవచ్చు. 11వ తేదీన సీట్లు కేటాయింపు చేస్తారు. కళాశాలలో రిపోర్టింగ్ 11వ తేదీ నుంచి 14వ తేదీ వరకు చేసుకోవాలి. 12వ తేదీ నుంచి తరగతులు ప్రారంభం అవుతాయి.

బడుగుల ఆశాజ్యోతి పూలే


వేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్

ఏలూరుసిటీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జ్యోతిరావుపూలే వర్ధంతి కార్యక్రమాన్ని ఏలూరులోని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలోని జ్యోతిరావు పూలే విగ్రహానికి జిల్లా ప్రజాపరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, సామాజిక అసమానతలను రూపు మాపటానికి కృషి చేసిన వ్యక్తి మహాత్మా జ్యోతిరావు పూలే అని కొనియాడారు. జ్యోతిరావు పూలేను అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలని ఆమె కోరారు. ఏలూరు 23వ డివిజన్ కార్పొరేటర్ కలవకొల్లు సాంబ, బీసీ నాయకులు పామర్తి అచ్యుత్ గౌడ్, బీసీ ఉద్యోగ సంఘ నాయకులు విఠల్ కుమార్ పాల్గొన్నారు.


గోడపత్రికను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఆర్జీయూకేటీ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

నూజివీడు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) :ఐఐటీ హైదరాబాద్‌తో కలిసి ఆర్జీయూకేటీ రోబోటిక్స్ ఫర్ అటానమస్ నావిగేషన్ సిస్టమ్స్‌పై స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తున్నట్లు ఆర్జీయూకేటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ ఎం.విజయ్ కుమార్, యూనివర్శిటీ రిజిస్ట్రార్ ఎస్.అమరేంద్రకుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించి గోడపత్రికను వారు గురువారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ డిసెంబర్ 10వ తేదీ నుంచి 14 వరకు ఈ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను నిర్వహించటం జరుగుతుందని, ఇందులో 50మంది అధ్యాపకులకు శిక్షణ కార్యక్రమం ఉంటుందని, అనంతరం 400 మంది విద్యార్థుల కోసం నాలుగు క్యాంపస్‌లలో శిక్షణ అందించేందుకు ఈ అధ్యాపకులు కృషి చేస్తారన్నారు. ఈ స్కిల్‌డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో పాల్గొనే విద్యార్థులు 9949860571కు సంప్రదించవచ్చని వారు తెలిపారు.

యువకుడి అనుమానాస్పద మృతి

ఆగిరిపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన ఘటన ఆగిరిపల్లిలో చోటు చేసుకున్నది. పోలీసుల సమాచారం మేరకు ఆగిరిపల్లికి చెందిన ఊటుకూరు ప్రవీణ్ కుమార్ (19) కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తుండగా ఈనెల 26 నుంచి కనబడక పోవటంతో చుట్టుపక్కల గాలించగా బుధవారం నగరపేటలో నిరుపయోగంగా ఉన్న బావిలో ప్రవీణ్‌కుమార్ మృతదేహం లభించింది. మృతుడి తల్లి కుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శుభశేఖర్ తెలిపారు. మద్యం మత్తులో బావిలో పడిపోయి ఉండవచ్చు అని పోలీస్ వర్గాలు తెలిపాయి.

వృద్ధుడి గల్లంతు

ఉంగుటూరు,నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఉంగుటూరులో స్నానానికి కాలువ రేవులో దిగిన యర్రారపు గంగరాజు(63)అనే వ్యక్తి గల్లంతయ్యాడు. ఇతని మృతదేహం కోసం గాలిస్తున్నారు.

వేరువేరు చోట్ల వరి గడ్డి దగ్ధం

కైకలూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): వేర్వేరు చోట్ల రెండు అగ్నిప్రమాదాల్లో సుమారు రూ.3లక్షల విలువైన గడ్డివాములు దగ్ధమయ్యాయని అగ్నిమాపక శాఖ అధికారి క్రాంతికుమార్ అన్నారు. తామరకొల్లు శివారు గంగులవానిగుంటలో రెండు ఎకరాల గడ్డివాము గురువారం దగ్ధమైంది. కోరుకొల్లులో జడ్డు వెంకటేశ్వరరావుకు చెందిన ఐదు ఎకరాల గడ్డివాముకు మంటలు అంటుకోవడంతో అగ్నిమాపకశాఖ అధికారులు అదుపుచేశారు. అప్పటికే చాలావరకు గడ్డివాము దగ్ధమైంది. లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన వరిగడ్డి దగ్ధమవడంతో రైతులు లబోదిబోమన్నారు.

అనుమతుల్లో వెసులుబాటు..
నిర్మాణాలు సులభతరం

» కసరత్తు చేస్తున్న ప్రభుత్వం
» కొత్త సంవత్సరం నుంచి సింగిల్ విండో విధానం
» ఇక రియల్ జోష్



భీమవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణాల్లో నిర్మాణాలు చేపట్టాలంటే వ్యయ ప్రసాలతో కూడిన పని. అధికారులు చుట్టూ ప్రదక్షిణలు చెయ్యాలి. ప్రజా ప్రతినిధులను పసన్నం చేసుకోవాలి. అప్పుడే అనుమతుల నుంచి నిర్మాణాల దాకా అన్ని సవ్యంగా సాగుతాయి. లేదంటే కొర్రివేస్తారు. ప్రజా ప్రతినిధులను కలుసుకోవాలని అధికారులులే సూచిస్తారు. ఐదేళ్ళు ఇటువంటి దందాలు అడ్డు అదుపు లేకుండా పోయింది. అటువంటి కష్ట, నష్టాలు లేకుండా అనుమతులు పొందేలా కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. సింగిల్ విండో విధానంలో అనుమతులు మంజూరు చెయ్యనున్నారు. ఆన్‌లైన్‌లో నగదు చెల్లింపులు, ప్లాన్ నమోదు చేసుకుంటే చాలు 15 ఎత్తు మీటర్ల భవనాలకు ఎటువంటి అనుమతులు అవసరంలేదు. అంతకు మించిన వాటికి పునాదులు వేసిన తరువాత ప్లాన్ పెట్టుకునే అవకాశాలను కల్పించనున్నారు. లైసెన్సు సర్వేయర్లు ఆన్‌లైన్‌లో ప్లాన్ నమోదు చెయ్యాలి. నిర్మాణదారులు ఆన్‌లైన్‌లో నగదు చెల్లించిన తరువాత ప్లాన్ ఆమోదం పొందుతుంది. ప్రత్యేక టాస్క్‌ఫోర్సు క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తుంది. ప్లాన్ అనుగుణంగా నిర్మాణాలు లేకపోతే సర్వేయర్ లైన్స్‌లను రద్దు చేస్తారు. అంతా సవ్యంగా ఉంటే నిర్మాణాలకు ఎటువంటి ఇబ్బందులు ఉండవు దీని వల్ల అధికారుల చుట్టు తిరిగే పరిస్థితి ఉండదు. కూటమి ప్రభుత్వం ఆదిశ గా ప్రయత్నాలు ప్రారంభించింది.

పన్నులు వెయ్యాలన్నా సిఫార్సులే

ప్రస్తుతం భవన నిర్మాణాలు చేపట్టాలంటే చాలా ఖాళీ స్థలాలకు పన్ను వెయ్యాలి. పన్ను వెయ్యాలని అధికారుల వద్దకు వెళితే సకాలంలో చర్యలు తీసుకోవటంలేదు. రోజులు తరబడి తిరగాల్సి వస్తోంది. ప్రజా ప్రతినిధులు సిఫార్సులు కావాలంటూ మునిసిపల్ రెవెన్యూ అధికారులు చెప్పే పరిస్థితి నెలకొంది. కానీ భవన నిర్మాణ ప్లాన్ తెచ్చుకున్నప్పుడు ఖాళీ స్థలాలకి కూడా ఆన్‌లైన్‌లో పన్ను చెల్లించుకునే అవకాశం ఉంది. నిర్మాణ దారులు ఇది తెలియక మునిసిపల్ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. అప్పుడే పన్నులు వేస్తున్నారు. తరువాత ప్లాన్‌లు పెట్టుకుంటున్నారు. ఇటువంటి కష్టాలను తొలగించేందుకు కూటమి ప్రభుత్వం కొత్త విధానంతో ముందుకు రానుంది. పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించేందుకు సన్నహాలు చేస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలో కి రావటంతో నిర్మాణదారుల్లోను ఆశలు పెంచింది. జిల్లాలో ఖాళీ స్థలాల పూడిక చేపడేతున్నారు. లే- అవుట్‌లు వేసేందుకు కసరత్తు చేస్తున్నారు. లే- అవుట్‌ల నిబంధనలల్లోను సరళతరం చెయ్యనున్నారు. రహదారులకు వెసులు బాటు కల్పించనున్నారు. దీని వల్ల అధికారిక లే- అవుట్‌లు వేసే అవకాశం ఉంది.

టీడీఆర్ బాండ్లపై వెసులుబాటు

వైసీపీ ప్రభుత్వ హయాంలో టీడీఆర్ కుంభకోణాలు సర్వసాధారణమైపోయాయి. తణుకు, తాడేపల్లిగూడెం మునిసిపాలిటీల్లో కోట్లాది రూపాయలు చేతులు మారాయి. వైసీపీ నేతల జేబులు నింపాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని టీడీపీ కూటమి ప్రభుత్వం టీడీఆర్ బాండ్ల జారీని నిలిపి వేసింది. ఇప్పుడు టీడీఆర్ బాండ్ల పైన స్థల యజమానులకు వెసులు బాటు ఇచ్చేలా నిర్ణయం తీసుకుంది. మాస్టర్ ప్లాన్‌ల రహదారి సరిహద్దులో నిర్మాణాలు చేపడితే మునిసిపాలిటీకి స్థలం ఇవ్వాలి. అందుకు 4 రెట్లు విలువైన బాండ్లను స్థల యజమానులకు ఇస్తోంది. దానిని ఇతరులకు విక్రయించుకునే అవకాశం ఉంది. అయితే బాండ్లు అవసరం లేదనుకునేవారు సదరు మాస్టర్ ప్లాన్‌కు అనుకునే అదనపు నిర్మాణాలు చేపట్టుకోవటానికి అవకాశం ఇవ్వాలని నిర్ణయించింది. దీని వల్ల టీడీఆర్ బాండ్ల అక్రమాలకు చెక్ పడనుంది.

బీఆర్‌ఎస్‌కు ఎదురుచూపు

తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ప్రతిసారి భవనాల క్రమబద్ధీకరణకు అవకాశం ఇస్తోంది. నిబంధనలు అతిక్రమించి భవనాలు నిర్మించినట్లేయితే జరిమానాల రూపంలో చెల్లించి క్రమబద్ధీకరించుకోవటానికి ప్రభుత్వం బీఆర్‌ఎస్‌ను అమలు చేస్తోంది. ఇప్పుడు కూడా ఆ పాత బీఆర్‌ఎస్ పథకం కోసం నిర్మాణాదారులు ఎదురు చూస్తున్నారు. ఎంతో మంది దరఖాస్తులు చేసుకోవటానికి సిద్ధంగా ఉన్నారు. బీఆర్‌ఎస్ ద్వారా మునిసిపాలిటీలకు ఆదాయం లభించనుంది. పట్టణాల అభివృద్ధికి అవకాశం ఉంటుంది. మునిసిపల్ అధికారులు కూడా ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారు.

క్రైమ్ కార్నర్

కువైట్‌లో గుండె పోటుతో మృతి


చిన్నబాబు (ఫైల్)

పెనుగొండ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జీవనోపాధి నిమిత్తం కువైట్ దేశం వెళ్లిన ఒక వ్యక్తి మృతి చెందాడు. పెనుగొండ మండలం దేవ గ్రామానికి చెందిన గూనపాటి చిన్నబాబు (40) ఆరు సంవత్సరాలుగా కువైట్ దేశంలో ఒక కంపెనీలో పని చేస్తున్నారు. చిన్నబాబు మూడు నెలల క్రితం దేవ గ్రామం వచ్చారు. తర్వాత కువైట్ లో గల కంపెనీకి వెళ్లారు. ఈ నెల 27వ తేదీన గుండె నొప్పితో మృతి చెందినట్లు భార్యకు సమాచారం వచ్చింది. చిన్నబాబు ఆకస్మికంగా మృతి చెందడంతో దేవ గ్రామంలో విషాద చాయలు అలముకున్నాయి. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహం కువైట్ నుంచి రావాల్సి ఉందని బంధవులు తెలిపారు.

గోదావరిలో పడి వ్యక్తి మృతి

యలమంచిలి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గంగడపాలెం గ్రామానికి చెందిన పొన్నమండ శ్రీనివాస్(38) చేపల వేటకు వెళ్లి పడవలోంచి ప్రమాదవశాత్తు గోదావరిలో పడి మృతి చెందినట్లు ఎస్ఐ కె.గుర్రయ్య తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చేపలవేట వృత్తిగా జీవనం సాగించే శ్రీనివాస్ గురువారం ఉదయం పడవపై గోదావరిలో చేపలవేటకు వెళ్లాడు. గోదావరిలో ఒకవ్యక్తి మునిగిపోతున్న విషయాన్ని గమనించిన ఒక స్థానికుడు గ్రామస్తులకు చెప్పడంతో పలువురు మత్స్యకారులు వెళ్లి గట్టుకు తరలించగా అప్పటికే శ్రీనివాస్ మృతి చెందాడు. మృతుని భార్య వెంకటరమణ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పంచాయతీ సెక్రటరీ, కుటుంబ సభ్యులపై చీటింగ్ కేసు

ఏలూరు క్రైం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఇంటిని తొలుత తనకా పెట్టి ఆపై విక్రయ రిజిస్ట్రేషన్ చేసి మళ్ళీ ఫోర్జరీ సంతకాలతో తమ పేరుపై మార్చుకుని మోసగించిన పంచాయతీ సెక్రటరీ అతని తల్లి, వదినలపై ఏలూరు త్రి టౌన్ పోలీస్ స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. పెదపాడు పంచాయతీ కార్యాలయంలో సెక్రటరీగా పనిచేస్తున్న సత్తినపల్లి వినయ్‌కుమార్ తల్లి కృష్ణవేణి పేరుమీద ఏలూరు వట్లూరు పరిధిలోని ఇంద్రప్రస్థాలో ఇల్లు ఉంది. ఆ ఇంట్లోనే ఉంటున్నారు. వినయ్‌కుమార్ సోదరుడు పలు అప్పులు పెట్టి అతను అదృశ్యమయ్యాడు. ఆ ఇంట్లో వినయ్‌కుమార్, అతని తల్లి కృష్ణవేణి, వదిన సాయిదుర్గలు ఉంటున్నారు. ఆ ఇంటిని గతంలో సత్రంపాడుకు చెందిన కె జ్యోతిర్మయికి తనకా రిజిస్ట్రేషన్ చేశారు. తాము అప్పు తీర్చలేమని మరో రూ.20 లక్షలు ఇస్తే రిజిస్ట్రేషన్ చేస్తామని చెప్పడంతో ఆ ఇంటిని రిజిస్ట్రేషన్ జ్యోతిర్మయి చేయించుకుని సొమ్ములు చెల్లించారు. అయితే కొద్ది రోజుల తరువాత ఇల్లు ఖాళీ చేస్తామని చెప్పడంతో వారి మాటలు నమ్మిన జ్యోతిర్మయి ఒప్పుకున్నారు. పంచాయతీ పంపు, కరెంటు బిల్లు జ్యోతిర్మయి పేరుమీద మార్చుకున్నారు. ఆమెకు తెలియకుండానే మళ్ళీ తిరిగి పంచాయతీ పంపును, కరెంటు బిల్లును కృష్ణవేణి పేరుమీదకు మార్చేసుకున్నారు. అంతే కాకుండా ఆ ఇల్లు తమదే నంటూ కోర్టులో కేసు వేశారు. తాము ఎలాంటి సంతకాలు పెట్టకుండా ఫోర్జరీ సంతకాలతో నకిలీ నోటరీలు తయారు చేసి కరెంటు ఆఫీస్‌కు, పంచాయతీ కార్యాలయానికి ఇచ్చి వారి పేరు మీద మార్చుకున్నారంటూ త్రి టౌన్ పోలీసులకు జ్యోతిర్మయి ఫిర్యాదు చేయడంతో పెదపాడు పంచాయతీ కార్యదర్శి సత్తినపల్లి వినయ్‌కుమార్, తన తల్లి కృష్ణవేణి, వదిన సాయిదుర్గలపై త్రి టౌన్ సీఐ ఎస్ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్ఐ కె ప్రసాద్ చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పుట్టకుండానే అమ్మకానికి బిడ్డ

- వైద్య ఖర్చులకు నగదు చెల్లింపు
- డెలివరీ కావడంతో తీసుకెళ్లడానికి విజయవాడ నుంచి వచ్చిన మహిళ
- అడ్డుకున్న పోలీసులు..
- ఐసీడీఎస్ అధికారుల విచారణ



బాలింత గౌరీ, తండ్రి చినబాబును విచారిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

జంగారెడ్డిగూడెం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పేదరికం జయించలేక కన్నబిడ్డను అమ్ముకోవడానికి ప్రయత్నించారో లేక అదే వృత్తిగా పెట్టుకున్నారో తెలియదు గానీ అమ్మ కడుపు నుంచి రాకముందే బేరం మాట్లాడుకున్న దంపతులు బిడ్డ పుట్టగానే ఓ మహిళకు అప్పగించడానికి సిద్ధపడిన ఘటన జంగారెడ్డిగూడెంలో ఆలస్యంగా వెలుగుచూసింది. పురిటి బిడ్డను తీసుకువెళ్లడానికి ప్రయత్నించిన ఓ మహిళను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బేబీ కమల చొరవతో ఆసుపత్రి సిబ్బంది పోలీసులు అడ్డుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.

తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం వేళ్ళచింతలగూడెం గ్రామానికి చెందిన కొయ్య చినబాబు ద్వారకాతిరుమల మండలం తిమ్మన పాలెం గ్రామానికి చెందిన గౌరీని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. కులాంతర వివాహం కావడంతో గౌరీ వైపు బంధువులు వీరిని పట్టించుకోవడం లేదు. వివాహం అనంతరం వీరు ఐదుగురు పిల్లలను కన్నారు. ఈ నెల 26వ తేదీ రాత్రి పదిగంటల ప్రాంతంలో గౌరీ ఐదవ బిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం ఆసుపత్రి వైద్యులు పిల్లలు పుట్టకుండా ఆమెకు సిజేరియన్ చేశారు. బిడ్డ పుట్టిన కొద్ది గంటలకే విజయవాడ బెంజ్‌సర్కిల్ కు చెందిన లక్ష్మి అనే మహిళ పుట్టిన మగబిడ్డను తీసుకువెళ్ళడానికి బిడ్డ తల్లిదండ్రులతో మాట్లాడుతుండగా విన్న సిబ్బంది వెంటనే ఆ విషయాన్ని ఆసుపత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ బేబీ కమలకు సమాచారమందించారు. వెంటనే ఆమె స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆసుపత్రికి వచ్చిన పోలీసులు మహిళను విచారించగా విస్తుపోయే విషయాలు చెప్పింది. తన సోదరికి పిల్లలు లేక పోవడంతో పెంచుకోవడానికి ఈ బిడ్డను తమకు ఇస్తానన్నారని గత కొంతకాలం నుంచి మందులకు, వైద్యానికి రూ.20 వేలు ఇచ్చినట్లు ఆమె తెలిపింది. అందుకే బిడ్డను తీసుకువెళ్ళడానికి వచ్చినట్లు చెప్పింది. తల్లిదండ్రులకు ఇష్టపూర్వకంగా బిడ్డను ఇచ్చినా చట్టప్రకారం దత్తత తీసుకోవాలి గానీ ఇలా అప్పుడే పుట్టిన పసికందును తీసుకువెళ్లడం చట్టరీత్యా నేరమని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బేబీ కమల ఆ మహిళను హెచ్చరించారు. దీంతో పోలీసులు ఆ మహిళను గద్దించి ఆసుపత్రి నుంచి పంపించి వేశారు.

ఐసీడీఎస్ సీడీపీవో విచారణ

ఐసీడీఎస్ సీడీపీవో పి.బ్యూలా సిబ్బందితో పసిబిడ్డ తల్లిదండ్రులు చినబాబు, గౌరీలను విచారించారు. చట్టప్రకారమే దత్తత ఇవ్వాలి కానీ సొంత పిల్లలైనంత మాత్రాన ఎవరికి పడితే వారికి ఇవ్వడానికి వీలు లేదని హెచ్చరించారు. ఇదిలావుండగా నాలుగో బిడ్డ పండుబాబు ప్రస్తుతం తల్లిదండ్రుల వద్ద లేడు. ఎక్కడ ఉన్నాడో తీసుకురావాలని ఐసీడీసెస్ అధికారులు కోరారు. పిల్లలను పేదరికం కారణంగా పోషించలేక పోతే స్త్రీ,శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సంరక్షణ కేంద్రాలలో చేర్పిస్తామని తెలిపారు.

దొంగల ముఠా కలకలం

- భీమవరంలో తొమ్మిది మంది అరెస్టు.. ముగ్గురు పరారీ
- రెండు కార్లు, రెండు ద్విచక్ర వాహనాలు, మారణాయుధాలు స్వాధీనం


దొంగలను అరెస్టు చేసి వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి (ఇన్‌సెట్‌లో) పోలీసులు స్వాధీనం చేసుకున్న మారణాయుధాలు

భీమవరం క్రైం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వ్యాపారంలో నష్టం వచ్చిన ఒక వ్యక్తి ధనవంతుల నివాసాల్లో దొంగతనం చేయాలని ఒక ముఠాను ఏర్పాటు చేసి దొచుకునే ప్రయత్నం చెయ్యగా పోలీసులకు పట్టుబడ్డారు. భీమవరంలో జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి వివరాలు వెల్లడించారు. కాకినాడ జిల్లా పెదపూడి మండలం రాజపూడి గ్రామానికి చెందిన గంపల ఆనందబాబు వ్యాపారంలో నష్టాలు రావడంతో ఇక వ్యాపారం వల్ల లాభం లేదని ఎక్కడైనా ధనవంతుల ఇళ్ళల్లో దొంగతనాలు చేసి విలాసవంతంగా బ్రతకాలనే ఉద్దేశంతో భీమవరం రెండవ పట్టణంలోని వంశీకృష్ణనగర్ ఏరియాలో ఉన్న వేగేశ్న రంగరాజు అనే వ్యక్తి నివాసాన్ని ఎంచుకున్నాడు. ఆనందబాబు స్నేహితుడు అయిన బత్తిన రవీంద్రకుమార్‌ను కలుసుకుని ఒక పథకం ప్రకారం ఆ ఇంటిని దోచుకోవాలని చెప్పడంతో పాటు ఇంట్లో ఎవరైనా అడ్డు వచ్చినా కూడా హతమార్చాలని చెప్పాడు. దీంతో రవీంద్రకుమార్ అతని స్నేహితుడైన గోనిపాటి నానికి విషయం చెప్పగా అతను రాజమండ్రి, కాకినాడకు చెందిన కొందరిని బరిలోకి దింపేందుకు సిద్ధమయ్యారు. మొత్తం 12 మంది కలిసి ఒక పథకాన్ని రచించుకుని దోచుకోవాలనుకుంటున్న ఇంటిని రెక్కీ చేశారు.

వంశీకృష్ణనగర్‌లో రెండు సార్లు రెక్కీ

వంశీకృష్ణ నగర్‌లో ఉన్న వేగేశ్న రంగరాజు నివాసం వద్ద ఈనెల 10వ తేదీన రెండుసార్లు రెక్కీ నిర్వహించారు. పూర్తిగా అవగాహనకు వచ్చాక ఈనెల 23వ తేదీ రాత్రి సుమారు 2గంటల ప్రాంతంలో రెండు కార్లు, రెండు ద్విచక్ర వాహనాలపై బయలుదేరి వచ్చారు. సుత్తులు, గునపాలు, కత్తులు, ఇనపరాడ్లు వారిని గుర్తు పట్టకుండా ఉండేందుకు మంకీ క్యాప్‌లు, గ్లౌజులు, నల్లటి టీషర్టులు తీసుకుని వచ్చారు. అయితే ఆ సమయంలో వాచ్‌మెన్, ఇంటి యజమాని గట్టిగా కేకలు వెయ్యడంతో వారు అక్కడ నుంచి పారిపోయారు. ఆతర్వాత ఇంటి యజమాని వేగేశ్న రంగరాజు టూటౌన్ పోలీసులకు ఈనెల 24వ తేదీన ఫిర్యాదు చేశారు.

రెండోసారి దొంగతనానికి ప్రయత్నం

ఆరోజు దొంగతనం చెయ్యడానికి కుదరకపోవడంతో మరలా రెండవ సారి ఈనెల 27వ తేదీన ఆ పన్నెండు మందిలో తొమ్మిది మంది భీమవరంలోని ఎస్ కన్వెన్షన్ రోడ్డు దగ్గర తిరుగుతూ ఉండగా అప్పటికే వారిపై కన్నేసి ఉంచిన టూటౌన్ సీఐ కాళీచరణ్ చాకచక్యంగా సిబ్బందితో కలిసి ఆ తొమ్మిది మందిని అరెస్టు చేసి 2 కార్లు, 2 బైక్‌లు, కత్తులు, సుత్తులు, రాడ్లు, మాస్కులు, గ్లౌజులు, తాడు స్వాధీనం చేసుకున్నారు.

అరెస్టు అయిన వారి వివరాలు

కాకినాడ జిల్లా పెదపూడి మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన గంపల ఆనంద్‌బాబు, కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వికె రాయపురం గ్రామానికి చెందిన బత్తిన రవీంద్రకుమార్, గోనుపాటి నానిబాబు, రాజమండ్రి, సింహాచలం నగర్‌కు చెందిన దడాల శివశంకర్, గుంట రత్నకుమార్, దొంతుమల్ల శ్యామ్, రాజమండ్రి వెంకటస్వామి స్వామి నగర్‌కు చెందిన ఉప్పకుమార్ రాజు, రాజమండ్రి మున్సిపల్ కాలనీకి చెందిన గంటశాల భవానిశంకర్, రాజమండ్రి సింహాచలం నగర్‌కు చెందిన నొక్కు నానిబాబును అరెస్టు చేశారు. పరారీలో కాకినాడకు చెందిన దార్తి దుర్గానపిన్, గెద్దాడ శ్యామ్ సత్యవరప్రసాద్, రాజమండ్రికి చెందిన చింటూ ఉన్నారని తెలిపారు.

స్టేషన్ ఆవరణలోనే దాక్కున్నాడు..

పోలీసుల హైరానా

ఏలూరు క్రైం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఒక వ్యక్తిని చెక్‌బౌన్స్ కేసులో పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తీసుకు వెళ్ళారు. స్టేషన్‌లో ఆ వ్యక్తి ఒక మూల నక్కి ఉండడంతో కొన్ని గంటలపాటు పోలీసులు హైరానా పడ్డారు. అతనిని కనుగొని వెంటనే అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. ఏలూరు అటవీ శాఖలో పనిచేసే వనమాటి సుబ్రహ్మణ్యంపై ఎస్ఐయాక్టులో నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ అయింది. ఏలూరు టూటౌన్ పోలీసులు అతనిని గురువారం అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తీసుకువెళ్ళారు. స్టేషన్‌లో బయట కూర్చున్న అతను వెంటనే మెట్ల పైనుంచి స్టేషన్ భవనంపైకి వెళ్ళి దాక్కున్నాడు. దీంతో పోలీసులు అతను పారిపోయాడేమోనని భావించి విస్తృతంగా గాలించారు. చివరకు 5.30 గంటల ప్రాంతంలో ఆ బిల్డింగ్ పైనున్నట్లు గుర్తించి వెంటనే అరెస్టు చేసి వైద్య పరీక్షలు నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకు వచ్చి మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచారు.

ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి చేద్దాం


అవగాహన ర్యాలీలో కమిషనర్ రామచంద్రారెడ్డి, తదితరులు

భీమవరంటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి చేద్దామని, అర్థరహితమైన ప్లాస్టిక్ అనారోగ్యమని, వాడవాడలా అవగాహన ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మునిసిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో మెప్మా, పీఆర్వో ఈసీఆర్పీ, మున్సిపల్ ఉద్యోగులు, సర్.సీవీ రామన్ స్కూల్ విద్యార్థులతో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను నిషేధించి గుడ్డ సంచులనే వాడాలన్నారు. అనంతరం అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వరావు మాట్లాడారు. చెరుకువాడ రంగసాయి ఆధ్వర్యంలో విద్యార్థులతో ప్రతిజ్ఞ నిర్వహించారు. సర్ సీవీ రామన్ స్కూల్ ప్రిన్సిపాల్ పెండ్యాల సరితా, అల్లు శ్రీనివాస్, మెప్మా మహిళలు పాల్గొన్నారు.

అదానీని తక్షణమే అరెస్టు చేయాలి



పెంటపాడు గేటు సెంటర్ వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

పెంటపాడు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి) : దేశ సంపదను కొల్లగొట్టి ప్రజల మీద భారాలు మోపి, దేశ ప్రతిష్ఠను దెబ్బతీసిన అదానీని తక్షణమే అరెస్టు చేయాలని సీపీఎం నాయకులు చింతకాయల బాబూరావు, సిరపరపు రంగారావు, చిర్లా పుల్లారెడ్డి, బంకూరు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం పెంటపాడు గేటు సెంటర్ వద్ద ధర్నా నిర్వహించి మాట్లాడారు. సోలార్ విద్యుత్ వినియోగదారులపై భారాలు మోపే విధంగా గత వైసీపీ ప్రభుత్వం ,అధికారులు, ప్రజాప్రతినిధులు రూ.1750 కోట్లు లంచాలు తీసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయన్నారు. దీనిపై కూటమి ప్రభుత్వం స్పందించి ఆదానితో జరిగిన ఒప్పందాలను తక్షణమే రద్దు చేయాలని కోరారు. బర్ల బాలాజీ, దొర్లు సీతయ్య, బొట్ట నారాయణ, గంట నరసింహులు తదితరులు పాల్గొన్నారు

వచ్చే విద్యా సంవత్సరానికి వర్సిటీ పనులు పూర్తి చేయాలి


వర్సిటీ డిజైన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాయకర్

నరసాపురం రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యా సంవత్సరం నాటికి పెండింగ్‌లో ఉన్న ఆక్వా యూనివర్సిటీ నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే నాయకర్ ఆదేశించారు. లిఖితపూడిలో రూ.72 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న పనులను గురువారం ఆయన పరిశీలించారు. పనుల పెండింగ్, వెచ్చించిన నిధులు, చేపట్టాల్సిన పనులపై అధికారుల నుంచి ఆరా తీశారు. పనులకు నిధుల కొరత లేనందున వేగవంతంగా భవనాలు పూర్తి చేయాలన్నారు. సమస్యలు ఉంటే కాంట్రాక్టర్లు తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తా మన్నారు. రవీంద్ర, వెంకటేశ్వరావు, నాని, కృష్ణ, ప్రసాద్ పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎన్జీవో నాయకులు

'సీపీఎస్ వద్దు, ఓపీఎస్ కావాలి' పోస్టర్ ఆవిష్కరణ

పాలకొల్లు అర్బన్ , నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): 'సీపీఎస్ వద్దు ఓపీఎస్ కావాలి' అంటూ పోస్టర్‌ను గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎన్జీవో నాయకులు గుడాల హరిబాబు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. నాయకులు మాట్లాడుతూ డిసెంబరు పదో తేదీన చలో విజయవాడ పీఈఎస్ ఉద్యోగుల మహాసభ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఏపీ సీపీఎస్‌ఈఏ జిల్లా గౌరవాధ్యక్షుడు, పాలకొల్లు తహసీల్దార్ దుర్గాకిషోర్ మాట్లాడుతూ సీపీఎస్ వల్ల అనేక మంది ఉద్యోగస్తులు, రిటైరైన వారు పెన్షన్‌లేక ఆర్థికంగా నష్టపోతారన్నారు. నాయకులు ఎంఆర్‌కే రాజు, లక్ష్మీనారాయణ, త్రినాథ్, బంగారు శివరామకృష్ణ, ఎస్.వీరాస్వామి, జి.శ్రీనివాస్, ఉదయ్ భాస్కరరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, వి.వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

తణుకు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో అందుబాటులో ఉన్న ధాన్యాన్ని వెంటనే రైతు సేవా కేంద్రాలకు తరలించాలని జిల్లా వ్యవసాయాధికారి జడ్ వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. గురువారం దువ్వ రైతు సేవా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఎంత ధాన్యం కొనుగోలు చేశారు.. ఎంత తరలించారో విషయాలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే సొమ్ము ఒక్క రోజులో పడుతుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఏడీఏ ఎం.వి. రమేష్, తహసీల్దార్ డీవీవీఎస్ అశోక్ వర్మ, ఏవో కుసుమ, రైతులు పాల్గొన్నారు.

• పోడూరు/పాలకొల్లు రూరల్, : తుఫాన్ ప్రభావం ఉన్నందున రైతు సేవా కేంద్రాల ద్వారా వచ్చిన ధాన్యాన్ని రైస్ మిల్లర్లు వెంటనే దిగుమతి చేసుకోవాలని నరసాపురం ఆర్డీవో దాసి రాజు ఆదేశించారు. పోడూరు మండలంలోని పెనుమదం, అప్పన్నచెర్వు రైస్ మిల్లులను, పాలకొల్లు మండలంలోని ఆగర్రులో ధాన్యం కల్లాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ధాన్యం దిగుమతుల్లో రైతులను ఎలాంటి ఇబ్బం దులు పెట్టొద్దని ఆదేశించారు. తహసీల్దార్ మహ్మద్ సయ్యద్ ఫాజిల్, సివిల్ సప్లయ్ డీటీ నాగదేవి, ఆర్ఐ కందుల రాంబాబు, వీఆర్వో రాజశేఖర్ ఉన్నారు. కవిటం గ్రామంలో ధాన్యం మాసూళ్లను తహసీల్దార్ మహ్మద్ సయ్యద్ ఫాజిల్ పరిశీలించారు. సివిల్ సప్లయ్ డీటీ నాగదేవి, వీఆర్వో కుమార్ ఉన్నారు.

• పెంటపాడు : వచ్చే మూడు రోజులలో తుఫాన్ రాష్ట్ర విపత్తుల సంస్థ జారీ చేసిన హెచ్చరిక నేపథ్యంలో రైతులు వరికోతలు వాయిదా వేసుకోవాలని తహసీల్దార్ ఏడిద శ్రీనివాస్, ఏవో పార్థసారథి సూచించారు. గురువారం రావిపాడు, అలంపురం, ప్రత్తిపాడు తదితర గ్రామాల్లో పర్యటించి రైతులతో మాట్లాడారు.


దువ్వలో అధికారులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు


అప్పన్నచెర్వులో రైస్ మిల్లును తనిఖీ చేస్తున్న నరసాపురం ఆర్డీవో దాసి రాజు


పెంటపాడు మండలంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాస్, ఏవో పార్థసారథి

ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాలకు తరలించాలి

» జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు

• ఇరగవరం : రానున్న నాలుగు రోజుల్లో అధిక వర్షాలు కురిసే అవకాశం ఉందని రైతులందరూ అప్రమత్తంగా ఉండాలని ఇరగవరం తహసీల్దార్ ఎం.సుందరరాజు రైతులకు సూచించారు. మండలంలోని గ్రామాల్లో ఆరబెట్టిన ధాన్యం రాశులను గురువారం ఆయన పరిశీలించారు. ఏవో వై.రాఘవేంద్రరావు, డిప్యూటీ తహసీల్దార్ పోతురాజు, సిబ్బంది పాల్గొన్నారు.

• యలమంచిలి : ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో వరికోతలను వాయిదా వేసుకోవాలని తహసీల్ధారు జి.పవన్‌కుమార్ రైతులకు సూచించారు. కాజతూర్పు, కాజ పడమర, ఊటాడ గ్రామాల్లో ఉన్న ధాన్యాన్ని ఏవో సీహెచ్.దేవితో కలిసి పరిశీలించి రైతులకు సూచనలిచ్చారు. రెవెన్యూ, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

• నరసాపురం రూరల్ : రైతులు కోసిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాల్లో ఒబ్బిడి చేసుకోవాలని వ్యవసాయశాఖ ఏడీఈ డాక్టర్ అనిల్‌కుమారి సూచించారు. గురువారం కొప్పర్రు గ్రామంలోని రైతు సేవా కేంద్రాన్ని ఆమె పరిశీలించి రైతులకు సూచనలిచ్చారు. ఏవో జాన్సన్, సిబ్బంది పాల్గొన్నారు.

• పెనుగొండ : తుఫాన్ ప్రభావంపై రైతులందరూ అప్రమత్తంగా ఉండాలని ఆర్‌డీవో వెంకట సుబ్రహ్మణ్యం సూచించారు. గురువారం పెనుగొండలోని చెరుకువాడ, పెనుగొండ గ్రామాల్లో ఆయన పర్యటించి రైతులకు సూచనలు చేశారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా తేమ శాతంతో సంబంధం లేకుండా కట్ పార్ములాను ఉపయోగించుకుని ధాన్యాన్ని మిల్లులకు తరలించే వెసులుబాటు ఉందన్నారు. తహసీల్దార్ బి.అనితకుమారి, సిబ్బంది ఉన్నారు.

లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

తణుకు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జాతీయ లోక్ అదాలత్ ద్వారా రాజీ చేసుకుని అన్నికేసులు వచ్చే నెల 14న జరిగే లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోవాలని నాలుగో అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి గురువారం ఓ ప్రకటనలో కోరారు. అదాలత్‌లో రాజీ చేసుకుని, సమయం, డబ్బు ఆదా చేసుకోవాలన్నారు. క్రిమినల్ కేసులు, కుటుంబ తగాదా కేసులు, భార్యాభర్తల భరణం కేసులు, మోటారు వాహన కేసులు, బ్యాంకు కేసులు, ప్రొనోటు కేసులు, ఇతర సివిల్ కేసులు రాజీ చేసుకోవాలన్నారు.

వైద్యుడి పోస్టు భర్తీ చేయాలి

పెనుగొండ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పెనుగొండలో సామాజిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ ఆఫ్ మెడిసిన్ పోస్టు ఖాళీని భర్తీ చేయాలని సీపీఎం కార్యదర్శి గంగారావు డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో గురువారం సీహెచ్‌సీ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం సీహెచ్‌సీ సూపరిటెండెంట్ జి.చంద్రసావేరికి వినతిపత్రం అందజేశారు. ఆరోగ్య కేంద్రంలో తక్షణం ఒక ఎండీ, కట్టు కట్టే పనివారు నాలుగు ఖాళీలు భర్తీ చేయాలన్నారు. ఎస్.వెంకటేశ్వరరావు, మాదాసు నాగేశ్వరరావు, నీలాపు ఆదినారాయణ, రాజమహేంద్రవరపు వెంకటేష్, శీలం ఏసు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ సీడింగ్ చేయించాలి

నరసాపురం టౌన్, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): ఆధార్ సీడింగ్ ఉదయం పూట సర్వర్ పని చేస్తున్నందున ప్రతి సచివాలయ ఉద్యోగి ఉదయంలోపే కార్యాలయాలను తీసి విధుల్లో ఉండాలని కమిషనర్ అంజయ్య ఆదేశించారు. గురువారం పట్టణంలోని 13వ సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆధార్‌సీడింగ్, పలు రికార్డులు పరిశీలించారు. ప్రజలు పెట్టుకున్న ప్రతి అర్జీకి సచివాలయ సిబ్బంది సమాధానం చెప్పాలన్నారు. ఇంకా ఎవరైనా ఆధార్ సీడింగ్ అవ్వని పక్షంలో వారి చేత త్వరితగతిన చేయించాలన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన సదస్సు

ఇరగవరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రేలంగి గ్రామ ఉన్నత పాఠశాలలో గురువారం బాలల సంరక్షణ జిల్లా బృందం ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలికల ప్రవర్తన సమాజంలో, కుటుంబంలో వారి వ్యక్తిగతంగా ఎలా ఉండాలి అనే విషయాలను బాలల సంరక్షణ జిల్లా అధికారి మమత బాలికలకు వివరించారు. పాఠశాల హెచ్ఎం వీరన్న, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాణిక్యాంబ, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

సీపీఎం సభకు విరాళాలు ఇవ్వండి

తాడేపల్లిగూడెం రూరల్ నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సీపీఎం నిర్వహించే మహాజన సభను జయప్రదం చేసేందుకు విరాళాలు ఇవ్వాలని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కర్రి నాగేశ్వరరావు కోరారు. పట్టణంలో గురువారం విరాళాలు సేకరించారు. ఆయన మాట్లాడుతూ డిసెంబరు 21,22,23వ తేదీల్లో భీమవరంలో నిర్వహించే మహాజన సభకోసం అంతా సహకరించాలని కోరారు.

బెల్టు షాపు నిర్వాహకుడి అరెస్టు

పాలకొల్లురూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పాలకొల్లు ఎక్సైజ్ స్టేషన్‌పరిధిలో గురువారం నిర్వహించిన దాడుల్లో భగ్గేశ్వరం గ్రామంలో టి.త్రిమూర్తులు అనే వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్దనుంచి తొమ్మిది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ మద్దాల శ్రీనివాస్ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐలు పి.మహేష్, జి.రఘు సిబ్బంది పాల్గొన్నారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

చిన్నారులు, మహిళలపై హింస వీడండి


కడియద్దలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్ నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) :చిన్నారులు, మహిళలపై జరుగుతున్న హింసను వీడాలంటూ మండలం లోని కడియద్దలో వీఆర్‌గూడెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు శ్రీహర్ష మాట్లాడుతూ దేశంలో మహిళలు, చిన్నారులపై జరుగుతున్న హింసను ప్రతీ ఒక్కరూ ఖండించాలని కోరారు. జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. హెచ్ఎం డీవీవీఎస్ఎన్ మూర్తి, ఉపాధ్యాయ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సిబ్బంది సొమ్ములు అడుగుతున్నారా ? : ఆర్డీవో


రోగులతో మాట్లాడుతున్న ఆర్డీవో దాసి రాజు

పాలకొల్లు అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఆసుపత్రి సిబ్బంది సొమ్ములు ఏమైనా అడుగుతున్నారా ? భోజనాలు ఎల్లా ఉన్నాయి అని ఆర్డీవో దాసి రాజు రోగులను అడిగారు. గురువారం సాయంత్రం స్థానిక ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ఉన్న వార్డుల సుపరిశీలించి బాలింతలు, రోగులను తమకు అందుతున్నవైద్య సేవలను ఎలా ఉన్నాయో అని ఆరా తీశారు. ఇబ్బందులు ఉంటే తెలియజేయాలని రోగులను కోరారు. మున్సిపల్ కమిషనర్ బి.విజయసారథి, సూపరిండెంటెంట్ డాక్టర్ ఒ.రవికుమార్, వైద్యులు, ఏఎన్ఎంలు, సిబ్బంది, ఉన్నారు.

మొదటి, రెండో దశల్లో క్యాన్సర్‌ను గుర్తించాలి

పాలకొల్లు అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మహిళల్లో రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వారం క్యాన్సర్లను మొదటి, రెండో దశల్లో గుర్తించి వైద్యచికిత్సలు అందిస్తే వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చని మణిపాల్ హాస్పటల్స్ క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ అల్లూరి వంశీకృష్ణ తెలిపారు. పట్టణంలో డిసెంబరు ఒకటో తేదీన కాస్మో స్పోర్ట్స్ కాంప్లెక్స్ క్లబ్, క్షత్రియ సంక్షేమ పరిషత్ సంయుక్తంగా నిర్వహించే మెగా వైద్య శిబిరంలో ఏర్పాట్ల నిమిత్తం పాలకొల్లు వచ్చిన ఆయన ఆంధ్రజ్యోతి ప్రతినిధితో మాట్లాడారు. ఉభయగోదావరి జిల్లాల్లోని 35 ఏళ్ళు దాటిన మహిళలు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకుని క్యాన్సర్ బారిన పడకుండా జాగ్రత్త పడాలని సూచించారు. కార్యక్రమంలో కాస్మో స్పోర్ట్స్ క్లబ్ ప్రతినిధులు ఉన్నారు.

పంచలోహ ఉత్సవ విగ్రహాల బహూకరణ

ఆకివీడు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : శ్రీవల్లి దేవసేన సమేత కల్యాణ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయానికి ఉప సభాపతి కనుమూరి రఘురామకృష్ణరాజు పంచలోహ ఉత్సవ విగ్రహాలు, వేళాయుధం ఏర్పాటు చేశారని టీడీపీ పట్టణ అధ్యక్షుడు బొల్లా వెంకట్రావు, మాజీ సర్పంచ్ గొంట్లా గణపతి అన్నారు. గురువారం దేవాలయ ప్రాంగణంలో విలేకర్ల సమావేశంలో టీడీపీ నాయకులు మాట్లాడారు. ఎన్నికల సమయంలో స్వామిని దర్శించుకుని విజయం సాధించిన నేపథ్యంలో దేవాలయానికి లక్ష రూపాయలు కూడా అందించారన్నారు. వేద పండితులు రామకృష్ణ, చందు, వెంకటరత్నం, సుబ్రహ్మణ్యం, రామశాస్త్రి, టీడీపీ నాయకుడు కిమిడి నాగరాజు, ఆలయ పర్యవేక్షకుడు మన్నే పోతురాజు తదితరులు ఉన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో 25 మంది ఎంపిక

తాడేపల్లిగూడెం రూరల్ నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):ఆచార్య నన్నయ విశ్వ విద్యాలయ క్యాంపస్‌లో గురువారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో 25 మంది ఎంబీఏ అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ టి.అశోక్ తెలిపారు. ఆకాశం ఆసుపత్రి వారు నిర్వహించిన ఇంటర్వ్యూలలో 50 మంది హాజరయ్యారని వివరించారు.


తణుకులో పూలే విగ్రహం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

జ్యోతిరావు పూలేకు ఘన నివాళి

పాలకొల్లు అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సామాజిక ఉద్యమ కర్త, మహిళా విద్య కోసం కృషి చేసిన మహాత్మ జ్యోతిరావు పూలే అని పలువురు నాయకులు అన్నారు. పూలే 134వ వర్ధంతి సందర్భంగా గురువారం పట్టణంలోని గాంధీ బొమ్మల సెంటర్ వద్ద ఉన్న పూలే విగ్రహానికి పలు పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ కార్యాలయంలో పట్టణ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు యడ్ల శివాజీ ఆధ్వర్యంలో, పట్టణ టీడీపీ నాయకులు కర్నేన గౌరునాయుడు, పెచ్చెట్టి బాబు, జీవీ తదితరుల ఆధ్వర్యంలో, వైసీపీ నాయకులు గుడాల గోపి, యడ్ల తాతాజీ ఆధ్వర్యంలో పూలే విగ్రహానికి నివాళులర్పించారు.

• భీమవరంటౌన్ : మహాత్మ జ్యోతిరావు పూలే అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని రిటైర్డు హెచ్ఎం గాదిరాజు రంగరాజు అన్నారు. జ్యోతిరావు పూలే వర్ధంతి కార్యక్రమాన్ని జిల్లా సర్వోదయ మండలి ఆధ్వర్యంలో భీమవరం వెంకట్రామ థియేటర్ ప్రాంగణంలో నిర్వహించారు. రిటైర్డు టీచర్ ఎస్కే చాన్ బాషా, కన్వీనర్ చెరుకువాడ రంగసాయి పాల్గొన్నారు.

• ఆచంట : వల్లూరులో ఎస్సీ, ఎస్టీ, ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా ప్రాంతీయ కార్యదర్శి నీతిపూడి వెంకట్రావు పూలే విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పలువురు పేదలకు వస్త్రాలు అందజేశారు.

• తణుకు/అత్తిలి : రాష్ట్రపతి రోడ్డులోని పూలే విగ్రహానికి టీడీపీ నాయకులు పూల మాలలు వేసి నివాళుర్పించారు. బార్ అసోసియేషన్ కార్యాలయంలో అసోసియేషన్ అధ్యక్షుడు సూరంపూడి కామేష్, న్యాయవాదులు పూలే చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అత్తిలి టీడీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు పోలిశెట్టి చంటి, పూతినీడి శ్రీనివాసరావు, మక్కా సూర్యారావు, గునా మావుళ్ళ ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి నివాళులర్పించారు.

• తాడేపల్లిగూడెం రూరల్ : పట్టణంలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పూలే విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. బీసీ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు వర్తనపల్లి కాశీ, పట్టణ అధ్యక్షుడు కేశవభట్ల విజయ్, యువజన అధ్యక్షుడు అత్తిలి బాబి తదితరులు పాల్గొన్నారు. వైసీపీ ఆధ్వర్యంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కర్రి భాస్కరరావు ఆధ్వర్యంలో పూలే వర్ధంతి నిర్వహించారు.

• గణపవరం : మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయ సాధనకు కృషి చేద్దామని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పాతపాటి హరికుమార్‌రాజు పేర్కొన్నారు. పూలే వర్ధంతి సందర్భంగా పిప్పర పార్టీ కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నేడు విద్యుత్ నిలుపుదల ప్రాంతాలు

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : తాడేపల్లిగూడెం పట్టణ పరిధిలోని పలు ఫీడర్‌లలో శుక్రవారం మరమ్మతుల నిమిత్తం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని ఈఈ కె.నరసింహమూర్తి తెలిపారు. ఎస్‌బిటీ కళాశాల, కోతిబొమ్మ సెంటర్, స్టేషన్ రోడ్డు, భూపాల్‌నగర్, ఏరియా ఆసుపత్రి, మామిడితోట, ప్రభుత్వ పాలిటెక్నిక్, హౌసింగ్‌బోర్డు, శశి కాలేజీ ప్రాంతం, గణేష్‌నగర్, మిలటరీ కాలనీ, గాంధీ బొమ్మ సెంటర్, సత్యవతి నగర్, వీకర్స్ కాలనీ, ఎఫ్‌సీఐ కాలనీ, బాపూజీ పుంతరోడ్డు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు వివరించారు.

• తాడేపల్లిగూడెం రూరల్ : తాడేపల్లిగూడెం మండలంలో శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని ఈఈ తెలిపారు. ఆరుగొలను, నందమూరు, మారంపల్లి, ఆరుళ్ళ, నవాబుపాలెం,దండగర్ర, కొత్తూరు, కృష్ణాయపాలెం, వీరంపాలెం, బంగారుగూడెం గ్రామాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపటి నుంచి దుంపగడప రైల్వే గేటు మూసివేత

ఆకివీడురూరల్ నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : దుంపగడప గ్రామంలోని రైల్వే గేటు ఈనెల 30వ తేదీ ఉదయం ఏడు గంటల నుంచి డిసెంబరు 9వ తేదీ రాత్రి ఏడు గంటల వరకు రైల్వే ట్రాక్, లెవెల్ క్రాసింగ్ మరమ్మతుల కోసం మూసివేస్తారని రైల్వే అధి కారులు సూచించారని తహసీల్దారు వెంకటేశ్వరరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వాహనదారులు, ప్రజలు గమనించగలరని ఆయన తెలియజేశారు.

ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రం పరిశీలన

కాళ్ళ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా కాళ్ళ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని శుక్రవారం కాళ్ళ తహసీల్దార్ జి.సుందర్ సింగ్ పరిశీలించారు. కాళ్ళ మండలంలో మొత్తం 52 ఉపాధ్యాయ ఓట్లు ఉన్నాయన్నారు. పోలింగ్ కేంద్రంలో విద్యుత్, తాగునీటి సౌకర్యం, ప్రహరీ, మరుగుదొడ్లు, వసతుల విషయమై పరిశీలన చేశామన్నారు. ఆర్ఐ లక్ష్మీకిరణ్, కార్యదర్శి బి.సతీష్, వీఆర్వోలు, విద్యాశాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆచంట పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ ఆకస్మిక తనిఖీ

ఆచంట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆచంట పోలీసుస్టేషన్‌ను నరసాపురం డీఎస్పీ డాక్టర్ జి.శ్రీవేద గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీసు సిబ్బంది విధులు, కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు, సిబ్బంది సమస్యలను తెలుసుకున్నారు. ఎస్ఐ కె.వెంకటరమణ తదితరులున్నారు.

పట్టభద్రుల ఓటర్ల మొదటి జాబితా సిద్ధం

మొగల్తూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబం ధించి ఓటర్ల మొదటి జాబితాను అధికారులు ఆమోదించారని తహసీల్దార్ కె.రాజ్‌కిషోర్ గురువారం తెలిపారు. మండలంలోని 17 గ్రామాలకు సంబంధించి 1,696 దరఖాస్తులు రాగా మొదటి జాబితాలో 1,416 మంది ఓటర్ల జాబితాలో ఉన్నాయన్నారు. మిగిలిన దరఖాస్తులను కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ కేవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో వీఆర్వోలు, బీఎల్‌వోలు, వీఆర్ఏల ఆధ్వర్యంలో పరిశీలిస్తున్నారన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

తణుకు, నవంబరు28(ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ డయల్ యువర్ డీఎం కార్యక్రమం శుక్రవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు జరుగుతుందని డీఎం గిరిధర్ కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాదు, తిరుపతి, భద్రాచలం, విజయవాడ సర్వీసులకు సంబంధించి సూచనలివ్వాలన్నారు. 99592 25484 నంబరుకు ఫోన్ చేయాలన్నారు.

కాపు వన సమారాధనకు తరలి రావాలి

నరసాపురం రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సీతారాంపురం లేసు పార్కు సమీపంలో వచ్చేనెల ఒకటిన ఏర్పాటు చేసే కాపు వనసమారాధనకు నియోజకవర్గం నుంచి మహిళలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కాపు సంఘం మహిళలు కోరారు. గురువారం ప్రాంగణంలో డాక్టర్ రాజ్యలక్ష్మి విలేకర్లతో మాట్లాడుతూ ఉసిరి చెట్టు పూజతో సమారాధన ప్రారంభమవుతుందన్నారు. మహిళలకు పలు ఆటల పోటీలతో పాటు మ్యూజికల్ చైర్స్, డ్యాన్స్, మెహందీ వంటి కార్యక్రమాలు ఉంటాయని, విజేతలకు బహుమతులందిస్తామన్నారు.

ఆధ్యాత్మికం

సోమేశ్వరుడికి లక్ష బిల్వార్చన

కాళ్ళ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కాళ్ళలోని గంగా పార్వతి సమేత సోమేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం లక్ష బిల్వార్చన పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన మందలపర్తి శ్రీచంద్రశేఖర్, బాల దంపతులచే తొలుత అమ్మవారికి సహస్ర కుంకుమార్చన, రుద్రహోమం నిర్వహించారు. 29వ తేదీ శుక్రవారంఅన్నసమారాధన నిర్వహిస్తున్నామన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు గుండాబత్తుల నాగేశ్వరరావు, గ్రామ అధ్యక్షుడు పెంటపాటి వెంకట నాగేశ్వరరావు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

• నరసాపురం టౌన్/మొగల్తూరు : నరసాపురం పట్టణంలోని ఏకాంబశ్వేరస్వామిని భక్తులు ప్రత్యేకంగా అలకరించారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని పలు రకాల స్వీట్లతో స్వామివారి విగ్రహానికి చుట్టూ అలంకరించారు. మొగల్తూరులోని రుక్మిణీ సత్యభామా సమేత రాజగోపాలస్వామి ఆలయంలో గురువారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు.

• భీమవరంటౌన్ : హౌసింగ్ బోర్డు కాలనీలో వున్న వెంకట సాయిబాబా వారి మందిరంలో కార్తీక మాసం ఆఖరి గురువారం సందర్భంగా విశేష కార్తీక దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. మందిరం నిర్మాణకర్త, చైర్మన్,రాష్ట్ర జనసేన పార్టీ ప్రోటోకాల్ చైర్మన్ మల్లినీడి తిరుమలరావు, మల్లినీడి సుధాకర్ కుటుంబ సభ్యులతో కార్తీక దామోదర తులసీధాత్రి సహిత ఆకాశదీప పూజాకార్యక్రమాలను సాయి సేవకులు నిర్వహించారు. పలు రకాలైన రంగులు, పుష్పాలు, దీపాలతో సాయినాథుడు, ఓంకారం, శివలింగాలను అలంకరించారు.

• అత్తిలి : కార్తీక మాసం సందర్భంగా అత్తిలి విశ్వవిద్యాన విద్యా ఆధ్యాత్మిక పీఠం అత్తిలి ఆశ్రమ ప్రాంగణంలో కార్తీక దీపోత్సవాన్ని ఘనంగా జరిపారు. కార్తీకమాసం ప్రారంభం నుంచి ప్రతి రోజు సాయంత్రం పీఠం సభ్యులు స్వామికి ఆరాధన చేసి, రాత్రి కార్తీక దీపాలను వెలిగిస్తున్నారు. గురువారం రాత్రి ఆశ్రమ ప్రాంగణంలో పెద్ద ఎత్తున దీపాలను వెలిగించడంతో శోభాయమానంగా వెలుగొందింది.


కాళ్ళ సోమేశ్వరస్వామికి అభిషేకం.. అలంకరణలో ఏకాంబశ్వేరస్వామి..భీమవరం వెంకట సాయిబాబా దేవాలయంలో కార్తీక దీపోత్సవం

కార్తీక వన సమారాధనలు

ఉండి : కార్తీక వనసమారాధనలు సంప్రదాయబద్ధంగా, భక్తితో నిర్వహించడం అభినందనీయమని టీడీపీ నాయకుడు తోట శ్రీరాములు అన్నారు. గురువారం పాములపర్రులో కార్తీక వనసమారాధన కార్యక్రమం తోట శ్రీరాము లు సౌజన్యంతో జరిగింది. ఎంపీటీసీ యడవల్లి వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ వర్రె పెదరాఘవులు, కోమటి నరేంద్ర బాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొత్తూరి వెంకటేశ్వరరాజు, గ్రామ అధ్యక్షుడు కేశ న యాదగిరి, నాయకులు, కార్యకర్తలు, తహసీల్దారు నాగార్జున, ఎంపిడివో రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

• మొగల్తూరు : కార్తీక మాసాన్ని పురస్కరించుకుని లక్ష్మణేశ్వరం గ్రామానికి చెందిన ప్రజాహిత బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో గురువారం వనసమారాధనను నిర్వహించారు. మొగల్తూరు వడయార్‌పేటలో వున్న వనమల్లికార్జున స్వామి ఆలయ ఆవరణలో వన సమారాధన కార్యక్రమాన్ని గ్రామ మాజీ సర్పంచ్, ఉప సర్పంచ్‌లు కలిదిండి స్వర్ణ, కుమార్‌బాబు, జ్యోతి వెలిగించి ప్రారంభించారు.

• ఆచంట : కార్తీకమాసం సందర్భంగా గురువారం వల్లూరు, ఆచంట వేమవరంలో గౌడ శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో వేడుకగా కార్తీక వన సమారాధన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పితాని తనయుడు వెంకట్, ఎమ్మెల్సీ కౌరు శ్రీనివాసు, మాజీ ఎమ్మెల్సీ మల్లుల లక్ష్మీనారాయణ, పాకా సత్యనారాయణ, పిల్లి సత్తిరాజు పాల్గొన్నారు. వీరిని సంఘం నాయకులు సన్మానించారు. సంఘ నాయకులు పాల్గొన్నారు.